నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 4-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:80 పేజీలు:68 వెల: రూ.1/-

నేటి కందం-నేటికి అందం

మగువలు మౌనము వీడగ
తగు విధముగ పాటుపడిన దారిని గనుచున్
జగదీశుం డందించెను
మగమానికముగ యశమును మరియాషాకున్ !!

(స్త్రీల ఆరోగ్య విషయాల గురించి ఎంతో కృషి చేసిన లక్ష్మీ కు చెందిన ఉపాధ్యాయురాలు మరియా షా గ్లోబల్ టెక్ ఛేంజ్ లో అంతర్జాతీయ స్థాయి లో విజేతగా నిలిచారు. ఇది భారతీయులందరూ గర్వించదగ్గ విషయం.)

-రాధశ్రీ
సెల్:9494481210



చురక

ఇల్లు కూల్చి ఎలుకలను
ఇంతకెన్ని పట్టినారు
సర్‌లో ఎన్ని చొరబాట్లు
సంఖ్య బయట పెట్టినారు.
కోట్ల వలస ఓటర్లని
కట్టుకథలు పేల్చినారు
తొలగించిన వాటిల్లో
తుదకు కొన్నే తేల్చినారు.

-వేల్పుల నారాయణ
9440433475



కేసీఆర్ హయాంలో తెలంగాణ సొత్తును కొల్లగొట్టారు.. మంత్రి పొంగులేటి ధ్వజం




ఖమ్మం, నవంబర్ 3: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తొమ్మిదిన్నరేళ్లు తెలంగాణను ఏలి పేదోళ్ల కష్టాలను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. వారి స్వార్థానికి, స్వలాభానికి రాష్ట్ర సొత్తును ఆ దొరలు కొల్లగొట్టి, ప్రజలను పేదవాళ్లుగా చేశారని ఆగ్రహించారు. ఈరోజు (మంగళవారం) ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ తెల్దారుపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ నందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు.

పొర్లు దండాలు పెట్టుకుంటూ ప్రతిపక్షాల నేతలు తమ ప్రభుత్వం గురించి విమర్శలు చేస్తున్నారని మంత్రి పొంగులేటి దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో రైతులు వరి సాగు వేస్తే ఉరే అన్నారని.. తమ ప్రభుత్వం అన్నదాతలు పండించిన పంటకు బోనస్ ఇచ్చి ఆదుకుందని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రతి పేదింటికి సంక్షేమ కార్యక్రమాలను అందజేస్తోందని వెల్లడించారు. తమ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని అన్నారు. ఇప్పటికే 74 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. మళ్లీ మరిన్ని ఉద్యోగాలను కల్పిస్తామని భరోసా కల్పించారు.

రాష్ట్రంలో 8 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు ఇచ్చామని మంత్రి పొంగులేటి తెలిపారు. 120 సంవత్సరాల క్రితం భూముల సర్వేలు జరిగాయని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి అంగుళం సర్వే చేసి భూములు ఉన్న వారికి పూర్తి భరోసా కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. పాలేరు నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో భూసర్వే చేయాలని కలెక్టర్‌ను ఆదేశించామని అన్నారు. మ్యాపులతో కూడిన సర్వేతో ఆధార్ ఎలా ఉందో.. భూదార్ కూడా అలానే ఉండేలా ప్రతి భూస్వామికి ఇచ్చి తీరుతామని స్పష్టం చేశారు. విద్య, వైద్యంపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలి: ఎమ్మెల్యే కూనంనేని



ఖమ్మం, నవంబర్ 3: జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోయి బీడు భూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలని.. కరువు ప్రభావిత ప్రాంతాలకు వెంటనే ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన పంటలకు, బీడు భూములకు పంట నష్టపరిహారం అందించాలని కోరారు. వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి, మిర్చి తదితర పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ కూలీలకు రూ.10 వేల కరువు భత్యం అందించాలని, రేషన్ బియ్యంతో పాటు 16 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు సమస్యపై దృష్టి సారించకుండా ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటున్నాయని కూనంనేని విమర్శించారు. రైతులు పంటలు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వాలు రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణ రాష్ట్రానికి రూ.25 వేల కోట్ల కరువు సహాయ నిధిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు భాగం హేమంతరావు, జిల్లా నాయకులు దొండపాటి రమేష్, ఎర్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రెజోనెన్స్- జూనియర్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి : ఉప్పుల శివ

హన్మకొండ, నవంబర్ 3 (నేటినిజం ప్రతినిధి) డెమొక్రటిక్ స్టూడెంట్స్? అసోసియేషన్(డీఎస్ఏ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనుమతులు లేని ప్రైవేటు జూనియర్ కళాశాలలకు కోమ్ముకాస్తున్న జిల్లా డిఐఈఓ దిష్టిబొమ్మని హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ జంక్షన్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా డీఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ మాట్లాడుతూ హనుమకొండ నగరంలో ప్రభుత్వ నియమనిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నడుస్తున్న రేజోనెన్స్? జూనియర్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని అనేకమార్లు జిల్లా ఇంటర్మీడియట్ బోర్డ్ బోర్డ్ అధికారికి వినతి పత్రాలు ఇచ్చిన స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు.

జిల్లా కలెక్టర్‌కి ప్రజావాణిలో పలుమార్లు ఆధారాలతో సహా వినతిపత్రాలు సమర్పించిన అధికారుల నుంచి స్పందన రాకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులులేని ప్రైవేటు జూనియర్ కళాశాలలకు జిల్లా డిఐఈఓ వత్తాసు పలుకుతున్నారని, ఆయా కళాశాలలపై ఫిర్యాదులు చేసినా కనీసం తనిఖీలు చేయకుండా ప్రైవేట్ యాజమాన్యలకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. నగరంలో సుమారు 9 రేజోనెన్స్? జూనియర్ కాలేజీలకు అనుమతులు లేవని, ఫైర్‌సేఫ్టీ, ఇతర ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలేసి ఇష్టానుసారంగా విద్యను వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం వెనక తాత్పర్యం ఏంటని వారు అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కమల్, వెంకటేష్, అభినయ్, గోవర్ధన్,సంపత్, శివరామ్, అమీర్ పాషా, జాషువా, రక్షిత్ పాల్గొన్నారు.

పలు జిల్లాల్లో భారీ వర్షం పడే చాన్స్

ఖమ్మం, భద్రాద్రి, మధిర, ఎర్రుపాలెం, వైరా, సత్తుపల్లి పరిసర ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
వరంగల్, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోనూ వర్షాలు
హైదరాబాద్‌లో పలుచోట్ల చిరుజల్లులు.. సాయంత్రం వరకు వర్ష సూచన
సంగారెడ్డి, నల్గొండ, సూర్యాపేట ప్రాంతాలపైనా ప్రభావం
నవంబర్ 4 ఉదయం వరకు అప్రమత్తత అవసరం



హైదరాబాద్, నవంబర్ 3: మురాసు తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటిన తుపాను క్రమంగా బలహీనపడుతున్నప్పటికీ దాని ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కొనసాగనున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

ఖమ్మం జిల్లాలో మధిర, ఎర్రుపాలెం, బోనకల్, వైరా, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, కొనిజర్ల, ఏన్కూరు ప్రాంతాలతో పాటు ఏపీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి, చండ్రుగొండ తదితర ప్రాంతాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోనూ విస్తారంగా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. హనుమకొండ, వరంగల్, సిద్ధిపేట, జనగామ, నల్గొండ, రంగారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి.

రాజధాని హైదరాబాద్‌లో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పలుచోట్ల చిరుజల్లులు, ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా సికింద్రాబాద్, ముషీరాబాద్, ఖైరతాబాద్, బేగంపేట, హిమాయత్‌నగర్ పరిసరాల్లో వర్షాలు పడవచ్చని అంచనా. హైదరాబాద్‌కు కూడా మెరుపులతో కూడిన వర్షాలపై పసుపు హెచ్చరిక అమల్లో ఉంది.

భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకపోవడం మంచిది. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడకూడదు. వరద నీరు ప్రవహించే రహదారులు, వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించవద్దు. అధికారిక వాతావరణ హెచ్చరికలు, జిల్లా యంత్రాంగం సూచనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలకు జానపద కళాకారులు

సిరిసిల్లకు బస్సులో బయలుదేరిన ధూంధాం కళాబృందం



నిజామాబాద్, నవంబర్ 3: తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలకు హాజరయ్యేందుకు నిజామాబాద్ జిల్లాకు చెందిన ధూంధాం, జానపద కళాకారులు మంగళవారం బస్సులో సిరిసిల్లకు బయలుదేరారు. నిజామాబాద్ జిల్లా కళాకారుల ఐక్యతకు మారుపేరని అధ్యక్ష, కార్యదర్శులు ఆర్టీసీ శ్రీనివాస్, అష్ట గంగాధర్ అన్నారు. కళామాతల్లి ముద్దుబిడ్డలమైన తామంతా ఒకే వాహనంలో వేడుకలకు తరలివెళ్లడం నంతోషంగా ఉందని కళాకారులు తెలిపారు.

సినీ పరిశ్రమతో పాటు జానపద వరిశ్రమకు ఆదరణ పెరుగుతున్న సమయంలో సిరిసిల్లలో ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించడం శుభపరిణామమని వారు అన్నారు. నిజామాబాద్ జిల్లాలోనూ ప్రతిభావంతులైన కళాకారులు ఉన్నారని, రానున్న రోజుల్లో మరిన్ని మంచి పాటలు రూపొందించాలని ఆకాంక్షించారు.

ఈ బస్సు యాత్రలో కోశాధికారి రాంపూర్ సాయి, కళాకారులు సాయి లవోల, గోదావరి, గోరకంటి రాజు, ప్రశాంత్ రెడ్డి, కర్క రమేష్, మీనా, మాదాస్ గోపి, మనోజ, సమత, చిన్న రాజేందర్, మహేందర్, డప్పు సంతోష్, స్రవంతి, ధర్పల్లి సాయి, డప్పు మహేష్, నరేష్, శ్రవణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండేలా 'సర్'ను వాడుతోంది.. ఎంపీ చామల ధ్వజం



హైదరాబాద్, నవంబర్ 3: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కార్‌పై కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి (అనీనిణతీవబబ ఓఖ అష్ట్రజీఎజీశ్రీజీ ఐతితీజీని ఐబీఎజీతీ ఖీవటటఎ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి బలం ఉన్న చోటే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో శాశ్వతంగా అధికారంలో ఉండేందుకు 'సర్'ను ఆయుధంగా బీజేపీ వాడుతోందని విమర్శించారు. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్‌లో మీడియాతో కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనలో తెలంగాణకు వాళ్లు చేసిన అభివృద్ధి ఏమైనా ఉంటే చెబుతారని అనుకున్నామని.. కానీ ఆయన కేవలం విమర్శలకు పరిమితం అయ్యారని ఆగ్రహించారు.

అమిత్ షా హైదరాబాద్ సభను మణిపూర్‌లో పెట్టాల్సిందని ఎంపీ చామల అన్నారు. మణిపూర్ భగ్గుమంటోందని.. ముందు కేంద్రం ఆ సంగతి చూడాలని హితవు పలికారు. దేశంలో ఇంత మంది విద్రోహ శక్తులు ఉంటే 2014 నుంచి బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. 3 కోట్ల మంది విదేశీ శక్తులు ఈ దేశంలో ఉంటె హోంశాఖ ఏం చేస్తోందని నిలదీశారు.దేశంలో ప్రతిపక్షాలకు విలువే లేదని అన్నారు. పార్లమెంట్ ఎలా నడపాలో మాక్ పార్లమెంట్‌లో తాము చూపించామని తెలిపారు.

కేంద్ర ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ఏకపక్షంగా కొనసాగించాల్సిన అవసరం మోదీ ప్రభుత్వానికి ఏముందని ఎంపీ చామల ప్రశ్నల వర్షం కురిపించారు. పార్లమెంట్ స్పెషల్ సెషన్ పెట్టాలని.. జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ అని బీజేపీ నేతలు అంటున్నారని.... తాము తలుచుకుంటే 2 సీట్లు ఉన్న కమలం పార్టీ ఈ స్థాయికి వచ్చేదా అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు.

తెలంగాణ అసెంబ్లీ విస్తరణకు ఆలోచన... కొత్త భవనాలు, పార్కింగ్‌కు ప్రతిపాదనలు..

హైదరాబాద్, నవంబర్ 3:తెలంగాణ శాసనసభ, శాసన మండలి ప్రాంగణాలను ఆధునిక సౌకర్యాలు, హంగులతో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కార్యాచరణకు సిద్ధమవుతోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈరోజు (మంగళవారం) శాసన మండలి ప్రాంగణాన్ని సందర్శించి, ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. అభివృద్ధి పనుల కోసం గుర్తించిన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ ప్రాంగణాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరించడంతో పాటు, ప్రజాప్రతినిధులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంపైనా ప్రధానంగా చర్చించారు.

శాసన సభ స్పీకర్, శాసన మండలి ఛైర్మన్‌తో పాటు కీలక ప్రజాప్రతినిధుల నివాస భవనాల నిర్మాణానికీ ప్రతిపాదనలను పరిశీలించారు. అలాగే శాసనసభకు అనుబంధ, పరిపాలనా భవనాల నిర్మాణంతో పాటు శాసనసభా పక్ష కార్యాలయాలు, విశ్రాంతి భవనం, క్రీడా మైదానం ఏర్పాటు వంటి ప్రతిపాదనలపై సీఎస్‌కు అధికారులు వివరించారు. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా పార్కింగ్ సౌకర్యాలను మెరుగుపరచడం, శాసనసభ ప్రాంగణాన్ని మరింత విస్తరించే అవకాశాలపైనా చర్చించారు. ప్రాంగణ విస్తరణలో భాగంగా పర్యాటక శాఖకు చెందిన భూమితో పాటు డీజీపీ కార్యాలయానికి సంబంధించిన కొంత భూమినీ శాసనసభకు బదిలీ చేసే అంశం కూడా సమీక్షకు వచ్చింది.



భరతమాత ఆత్మ భారత రాజ్యాంగమే !

(04 నవంబర్ 1948 : "రాజ్యాంగ ముసాయిదాను రాజ్యాంగ సభలో చర్చకు సమర్పించిన దినం" సందర్భంగా)

భారత రాజ్యాంగ ముసాయిదాను 21 ఫిబ్రవరి 1948 నాటికే పూర్తి చేశారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన 04 నవంబర్ 1948 రోజున రాజ్యాంగ సభలో అధికారికంగా రాజ్యాంగ ముసాయిదాను ప్రవేశపెట్టిన కీలక ఘట్టం తర్వాత రాజ్యాంగ ముసాయిదాపై తొలి పఠనం ప్రారంభమైనది. ఈ రోజున రాజ్యాంగ ముసాయిదాపై లోతైన చర్చలు, సవరణలు ప్రతిపాదించడం జరిగింది. నాటి రాజ్యాంగ సభ (కాన్స్టిట్యుయెంట్ అసెంబ్లీ)లో ప్రతి సభ్యుడికి రాజ్యాంగ ముసాయిదా కాపీని అందించారు. తదుపరి 04 నవంబర్ నుంచి 09 నవంబర్ 1948 వరకు మొదటి పఠనం జరిగింది. ముసాయిదాపై దాదాపు 10 రోజుల పాటు చర్చలు జరిగిన 17 నవంబర్ 1948 వరకు కొనసాగాయి. రాజ్యాంగ సభలోని నాటి సభ్యులు రాజ్యాంగ ముసాయిదాలోని పలు అంశాలపై చర్చలు జరిపి సూచనలు, సవరణలు తెలియజేశారు. తదుపరి వివిధ అధికారిక వాటాదారుల సూచనల ఆధారంగా కొన్ని సవరణలు కూడా జరిగాయి. భారత రాజ్యాంగాన్ని 2 ఏండ్ల 11 నెలల, 18 రోజుల్లో తయారు చేయడం జరిగింది. రాజ్యాంగ సభ 11 సార్లు, 165 రోజుల పాటు సమావేశం అయ్యింది. ఇందులో 114 రోజులు రాజ్యాంగ రాతప్రతిపై చర్చకు వెచ్చించారు. రాతప్రతిలో 7,635 సవరణలు ప్రతిపాదించగా, అందులో 2,473 ప్రతిపాదనలను పరిశీలించి, చర్చించి, పరిష్కరించింది. భారత రాజ్యాంగాన్ని 26 నవంబర్ 1949న సభలో ఆమోదించారు. 24 జనవరి 1950న 284 మంది రాజ్యాంగ సభ్యులు చిరు జల్లు పడుతున్న శుభవేళ సంతకాలు చేసారు. 26 జనవరి 1950 రోజున భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన వేళ మనం గణతంత్ర దినోత్సవాన్ని ప్రతి ఏట ఒక పరమ పవిత్ర పర్వదినంగా, ఘనంగా నిర్వహించుకుంటున్నాం. ఆ రోజున భారత రాజ్యాంగ సభ రద్దు చేయబడి, తాత్కాలిక పార్లమెంట్‌గా మారింది. 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో కొత్త పార్లమెంట్ ఏర్పడింది.

భారత రాజ్యాంగ మౌళిక స్వరూపం:

స్వతంత్ర భారత రాజ్యాంగాన్ని తయారు చేయడానికి ఒక రాజ్యాంగ సభ లేక రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు. ఈ సభలో రాష్ట్ర శాసనసభల ద్వారా ఎన్నికైన సభ్యులు 292, భారత్ సంస్థానాల నుండి ఎన్నికైన సభ్యులు 93 మంది, చీఫ్ కమిషనర్ ప్రావిన్సుల ప్రతినిధులు నలుగురు కలిపి మొత్తం 389 మంది ఉన్నారు. రాజ్యాంగ సభ తొలి సమావేశం పార్లమెంట్ భవనంలో 09 డిసెంబర్ 1946న జరిగింది. జవహర్ లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, సర్దార్ పటేల్, ఆచార్య కృపలానీ, డా రాజేంద్రా ప్రసాద్, సరోజినీ నాయుడు, బి ఆర్ అంబేద్కర్, టంగుటూరి ప్రకాశం పంతులు, పట్టాలి సీతారామరాజు మొదలైన సభ్యులు ఉన్నారు. రాజ్యాంగ రాతప్రతిని తయారు చేయడానికి బి ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటు చేసారు. భారత రాజ్యాంగంలో అవతారిక, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, ఆదేశిక సూత్రాలు, కార్యనిర్వాహక వ్యవస్థ (ప్రభుత్వం, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రి మండలి), శాసన వ్యవస్థ (పార్లమెంట్, ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు, జిల్లా కోర్టు), రాష్ట్రాలు (శాసన సభ, శాసన మండలి, గవర్నర్, ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం), ఎన్నికల వ్యవస్థ (రాజకీయ పార్టీలు, లోకసభ, రాజ్యసభ, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, రాష్ట్ర పార్టీలు, రాష్ట్ర శాసన సభ, రాష్ట్ర శాసన మండలి, స్థానిక సంస్థల ఎన్నికలు) లాంటివి పొందుపరుచబడ్డాయి.

భారత రాజ్యాంగం : ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం:

ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగంగా భారత రాజ్యాంగం సగర్వంగా నిలుస్తున్నది. ఇందులో అవతారిక, 448 అధికరణాలు, 12 షెడ్యూళ్ళతో కూడిన మహా గ్రంథం మన రాజ్యాంగం. మొదట్లో అవతారికలా భారత దేశాన్ని సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా పేర్కొన్నారు. తదుపరి జరిగిన 42వ రాజ్యాంగ సమరణ ద్వారా సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా మార్చారు.

నేటికి భారత రాజ్యాంగంలో మొత్తం 106 సవరణలు జరిగాయి. మొదటి రాజ్యాంగ సవరణ 1951లో జరుగగా, 106వ రాజ్యాంగ సవరణగా "నారీ శక్తి వందన్ చట్టం(చట్ట సభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు)" 2023లో జరిగింది.

భారత రాజ్యాంగం దేశ ప్రజలకు శాంతి, సమైక్యత, సంపద, సౌభాగ్యాలను అందించే మహా గ్రంథంగా మనకు మార్గనిర్దేశనం చేస్తున్నది. సమయానుకూలంగా, ప్రాధాన్యతాక్రమంలో భారత రాజ్యాంగంలో సవరణలు చేస్తున్నాం. రాజ్యాంగం గురించి తెలుసుకోవడం మాత్రమే ముఖ్యం కాదని, దానిని తూచా తప్పకుండా పాటించాలనా మరిచిపోరాదు. రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తే భరతమాత పౌరులుగా జీవించే హక్కును కోల్పోతారు. భారతీయులకు పరమ పవిత్ర జీవన గ్రంథంగా భారత రాజ్యాంగం సదా పూజించబడాలి, ఆచరణ మార్గం చూపాలి.



-మధుపాళీ
9949700037

వీబీ-జీ రామ్ జీ చట్టం కింద ఫిర్యాదుల పరిష్కార నిబంధనలు- 2026ను ప్రకటించిన గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, నవంబర్ 3:భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ 'వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (వీబీ-జీ రామ్ జీ) పథకం అమలుకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం 'ఫిర్యాదుల పరిష్కార నిబంధనలు-2026'ను ప్రకటించింది. ఈ నిబంధనల ద్వారా క్రమబద్ధమైన, బహుళ అంచెల, నిర్దిష్ట గడువుతో కూడిన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత అందుబాటులోకి తీసుకురావడం, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడం ఈ నిబంధనల లక్ష్యం. అదే సమయంలో పౌరుల సమస్యలను సకాలంలో పరిశీలించి, తగిన చర్యలు తీసుకునేలా ఈ వ్యవస్థను రూపొందించారు.

ఈ నిబంధనల ప్రకారం.. గ్రామ పంచాయతీ, బ్లాక్, జిల్లా స్థాయిల్లో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దిష్ట గడువుతో కూడిన బహుళ అంచెల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఆయా స్థాయిల్లో నియమితులైన ఫిర్యాదుల పరిష్కార అధికారులు ఫిర్యాదులను స్వీకరించడం, నమోదు చేయడం, విచారించడం, పరిష్కరించడం వంటి బాధ్యతలను నిర్వహిస్తారు.

జిల్లా స్థాయిలో ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను జిల్లా కార్యక్రమ సమన్వయకర్త పర్యవేక్షిస్తారు. నియమిత వ్యవస్థతో పాటు ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల ద్వారా ఫిర్యాదులపై చర్యలు తీసుకునేలా చూస్తారు.

ఫిర్యాదుల సమర్పణను సులభతరం చేసేందుకు, పథకం అమలుకు సంబంధించిన లేదా దానితో ముడిపడి ఉన్న ఏ అంశంపైనైనా ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం ఈ నిబంధనల్లో పలు మార్గాలను కల్పించారు.

గ్రామ పంచాయతీ, బ్లాక్ లేదా జిల్లా స్థాయిలో భౌతిక రూపంలో అందిన ఫిర్యాదులను స్వీకరించిన రోజే నిర్దేశిత డిజిటల్‌ప్రజా మౌలిక సదుపాయాల్లో నమోదు చేయాలి. ఆ రోజు నమోదు చేయడం సాధ్యం కాని పరిస్థితుల్లో, తదుపరి పని దినంలోగా నమోదు చేయాల్సి ఉంటుంది.

ఫిర్యాదు నమోదైన వెంటనే ఫిర్యాదుదారుడికి రశీదు అందజేస్తారు. అందులో ఫిర్యాదు నమోదు సంఖ్య, స్వీకరించిన తేదీ, ఫిర్యాదును స్వీకరించిన అధికారి హోదా వివరాలు ఉంటాయి. డిజిటల్ విధానంలో ఫిర్యాదు సమర్పించిన వారికి ఎలక్ట్రానిక్ రూపంలో, భౌతికంగా ఫిర్యాదు అందించిన వారికి భౌతిక రూపంలో ఈ రశీదును అందిస్తారు.

ముఖ్యంగా ఫిర్యాదు సమర్పించిన విధానం, భాష, రూపం లేదా ప్రక్రియాపరమైన లోపాలను కారణంగా చూపి ఏ ఫిర్యాదునూ నవోదు చేయకుండా తిరస్కరించకూడదు. ఈ నిబంధన ద్వారా ప్రక్రియాపరమైన నిబంధనలు పౌరులకు అడ్డంకిగా మారకుండా, ప్రతి ఒక్కరికీ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అందుబాటులో ఉండేలా చూస్తారు.

ఫిర్యాదులను సత్వరంగా పరిశీలించి పరిష్కరించేందుకు ఈ నిబంధనల్లో స్పష్టమైన గడువులను నిర్దేశించారు. నమోదైన ప్రతి ఫిర్యాదును సంబంధిత ఫిర్యాదుల పరిష్కార అధికారి పరిశీలించి, అవసరమైన విచారణ చేపట్టాలి. ఇందుకోసం సంబంధిత అధికారులు లేదా సిబ్బంది నుంచి అవసరమైన రికార్డులు, రిజిస్టర్లు, పత్రాలు, నివేదికలు, ఎలక్ట్రానిక్ డేటా లేదా ఇతర సమాచారాన్ని ఆ అధికారి కోరవచ్చు.

అవసరమైన సందర్భాల్లో ఫిర్యాదుపై తుది నిర్ణయం తీసుకునే ముందు ఫిర్యాదుదారుడికి తన వాదనను వినిపించుకునే సముచిత అవకాశం కల్పించాలి. ఇందుకోసం ప్రత్యక్షంగా లేదా ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా అవకాశం ఇవ్వవచ్చు.

ఫిర్యాదు అందిన తేదీ నుంచి ఏడు పని దినాల్లోగా దానిపై విచారణ పూర్తి చేయాలి. విచారణ పూర్తయిన అనంతరం ఫిర్యాదుల పరిష్కార అధికారి తన నిర్ధారణలను నమోదు చేసి, చట్టం, నిబంధనలకు అనుగుణంగా తగిన దిద్దుబాటు లేదా పరిష్కార చర్యలు చేపట్టాలి లేదా చేపట్టేలా చూడాలి. ఫిర్యాదు అందిన తేదీ నుంచి 15 రోజుల్లోగా దాన్ని పరిష్కరించాలి.

విచారణలో వెల్లడైన అంశాలు, తీసుకున్న చర్యల వివరాలను నిర్దేశిత డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల్లో నమోదు చేసి, వాటిని ఫిర్యాదుదారుడికి తెలియజేస్తారు. భౌతిక రూపంలో అందిన ఫిర్యాదుల విషయంలో, వాటి పరిష్కార వివరాలు, తీసుకున్న చర్యలను కూడా ఫిర్యాదుదారుడికి భౌతిక రూపంలోనే తెలియజేస్తారు.

నిర్దేశిత డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు ద్వారా ఫిర్యాదు నమోదు నుంచి తుది పరిష్కారం వరకు ప్రతి దశను పర్యవేక్షించవచ్చు. విచారణ, నిర్ధారణలు, తీసుకున్న చర్యల వివరాలను కూడా ఎలక్ట్రానిక్ రూపంలో నమోదు చేసేందుకు ఈ వేదిక వీలు కల్పిస్తుంది. తద్వారా ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత బలోపేతం అవుతాయి.

నిర్దేశించిన 15 రోజుల గడువులోగా పరిష్కారం కాని ఫిర్యాదులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా తదుపరి ఉన్నత స్థాయికి పంపిస్తారు. ఈ విధంగా అందిన ఫిర్యాదును సంబంధిత అధికారి పరిశీలించి, దాని పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదు పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని ఎలక్ట్రానిక్ విధానంలో నిరంతరం పర్యవేక్షిస్తారు

ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కింద జారీ చేసిన ఉత్తర్వులపై అప్పీలు చేసుకునేందుకు కూడా ఈ నిబంధనల్లో అవకాశం కల్పించారు. వికసిత్ భారత్?జీ రామ్ జీ చట్టం-2025లోని షెడ్యూల్-ఎ ప్రకారం ఈ అప్పీళ్లను దాఖలు చేసి, పరిష్కరిస్తారు.ఈ నిబంధనల ద్వారా వీబీ-జీ రామ్ జీ పథకం కింద పౌరులకు అందుబాటులో ఉండేలా, వారి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ, నిర్దిష్ట గడువులో ఫిర్యాదులను పరిష్కరించే వ్యవస్థను సంస్థాగతంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బహుళ అంచెల వ్యవస్థ, ఫిర్యాదుల సమర్పణకు పలు మార్గాలు, తప్పనిసరి నవోదు, నిర్దిష్ట గడువులు, డిజిటల్ పర్యవేక్షణ, పరిష్కారం కాని ఫిర్యాదులను ఉన్నత స్థాయికి పంపే విధానం ద్వారా పాలనా జవాబుదారీతనం బలోపేతం కావడంతో పాటు వథకం అమలులో స్పందన మరింత మెరుగుపడుతుందని భావిస్తున్నారు.వీబీ-జీ రామ్ జీ పథకం అమలుకు సంబంధించిన ఫిర్యాదులను క్రమబద్ధంగా, పారదర్శకంగా, నిర్దేశిత గడువుల్లో పరిష్కరించేలా చూడటంలో ఈ నోటిఫికేషన్ కీలక ముందడుగు. తద్వారా ఈ వథకం కింద గ్రామీణ కుటుంబాలకు కల్పించిన హక్కులు, ప్రయోజనాలకు మరింత భరోసా లభించనుంది.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య..

ఆదిలాబాద్, నవంబర్ 3: (ఆంధ్రప్రభ) : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలంలోని బూషిమెట్ల పంచాయతీలో గల భూషమట్ట క్యాంపు గ్రామానికి చెందిన ఆదివాసి రైతు గోటేకర్ సూర్య బాన్ (50) ఈఏడాది పంట దిగుబడి రాలేదని మనస్థాపంతో సాగు చేస్తున్న వంటలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యనికి పాల్పడ్డాడు.

ఆయన బంధువులు తెలిపిన వివరాల ప్రకారం సూర్య బాన్ రైతు పురుగుల మందు తాగిన విషయమైన కుమారుడు గమనించి జైనూర్ ఆసుపత్రికి తరలించగా జైనూర్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్సలు చేసి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యాధికారి అశోక్ సూచన మేరకు 108 ద్వారా ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించి అక్కడ చికిత్సల పొందుతూ మృతిచెందాడని ఆయన బంధువులు తెలిపారు. బంధువులు తెలిపిన ప్రకారంగా? ఈ ఏడాది సూర్య బాన్20 బ్యాగుల పత్తి వేయగా.. దిగుబడి రాకపోవడంతో అప్పులు అవుతానని మనస్థాపంతో పంట పొలంలోనే పురుగుల మందు తాగాడని తెలిపారు. ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని బూసిమెట్ట సర్పంచ్ ఆత్రం సింధు నగేష్, ఉప సర్పంచ్, బంధువులు పేర్కొన్నారు.

బిఆర్ఎస్ సర్కార్ అభివృద్ధి చిహ్నాల తొలగింపుపై రగడ..

బిఆర్ఎస్ సర్కార్ అభివృద్ధి చిహ్నాల తొలగింపుపై రగడ
పైలాన్ తరలింపును అడ్డుకున్న గులాబీ నేతలు
కార్పొరేషన్, పోలీస్ లతో మాజీ ఎమ్మెల్యే వాగ్వివాదం



కరీంనగర్, నవంబర్ 3:పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో మంగళవారం ఉదయం అభివృద్ధి చిహ్నం (పైలాన్ తొలగింపు) రగడగా మారింది. టిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో పైలాన్ తొలగింపును అడ్డుకునే ప్రయత్నం చేశారు. కెసిఆర్ ప్రభుత్వ హాయంలో అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా రామగుండం కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులకు గుర్తుగా నగరంలో ఏర్పాటు చేసిన పైలాన్ తొలగింపు పై గులాబీ శ్రేణులు గరం గరం అయ్యారు. గత ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి పనులకు విలువ లేదా..! రాజకీయ కుట్రలతో పైలాన్ తొలగింపు సరికాదంటూ మాజీ ఎమ్మెల్యే చందర్ తీవ్రంగా మండిపడ్డారు.

కార్పొరేషన్ అధికారులను, పోలీస్ అధికారులను నిలదీశారు. పైలాన్ తొలగింపుకు ఎవరు అనుమతి ఇచ్చారో చెప్పాలంటూ చందర్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి, పోలీస్ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ప్రమాదాలకు పైలన్ కారణంగా మారిందన్న నేపథ్యంలో రహదారి పైనున్న పైలాన్ ను మున్సిపల్ అధికారులు తొలగింపులు చేపట్టినట్టు తెలుస్తోంది. అభివృద్ధి చిహ్నాలు కూల్చివేసేందుకు అనుమతులు ఎవరిచ్చారు అని చందర్ ప్రశ్నించారు. పైలాన్ తొలగింపు? కూల్చివేతల కోసం ఘటన స్థలికి వచ్చిన జెసిబి ముందు టిఆర్ఎస్ నేతలు బైటాయించారు. రామగుండం ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలంటూ టిఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. కార్పొరేషన్ లో కౌన్సిల్ తీర్మానం లేకుండా అభివృద్ధి చిహ్నాలను ఎలా తొలగిస్తారు అంటూ టిఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కు సమాచారం లేకుండా పైలాన్ తొలగింపు పూర్తిగా దౌర్జన్యమైనని ఆక్రోషించారు.

కోల్ ఇండియా వృద్ధిలో కీలక చోదకశక్తిగా అవతరించిన డబ్ల్యూసీఎల్.. బొగ్గు ఉత్పత్తి, సరఫరా, ఓవర్‌బర్డెన్ తొలగింపులో గణనీయమైన వృద్ధి నమోదు

న్యూఢిల్లీ, నవంబర్ 3:బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ - వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (డబ్ల్యూసీఎల్) కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) వృద్ధిలో కీలక చోదకశక్తిగా అవతరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి, సరఫరా, ఓవర్‌బర్డెన్ తొలగింపు వంటి మూడు కీలక కార్యకలాపాల్లోనూ గణనీయమైన పనితీరు కనబరిచింది. 2026 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు మూడు కీలక కార్యాచరణ ప్రమాణాల్లోనూ నిర్దేశిత లక్ష్యాలను అధిగమించిన సీఐఎల్ అనుబంధ సంస్థగా డబ్ల్యూసీఎల్ ఒక్కటే నిలిచింది. ఈ కాలంలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో 102.47 శాతం, సరఫరా లక్ష్యంలో 108.82 శాతం, ఓవర్‌బర్డెన్ తొలగింపు లక్ష్యంలో 104.56 శాతం సాధించింది.

సంస్థ సాధించిన ఈ మెరుగైన కార్యాచరణ ఫలితాలు దేశీయంగా బొగ్గు లభ్యతను గణనీయంగా పెంచడంతో పాటు, భారత ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో కీలకంగా దోహదపడ్డాయి. 2026 ఏప్రిల్ - అక్టోబర్ మధ్య డబ్ల్యూసీఎల్ అదనంగా 4.53 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. ఇదే కాలంలో కోల్ ఇండియా లిమిటెడ్ సాధించిన మొత్తం నికర ఉత్పత్తి వృద్ధి కంటే డబ్ల్యూసీఎల్ అదనపు ఉత్పత్తి ఎక్కువగా ఉండటం విశేషం.

2026 అక్టోబర్ నెలలో డబ్ల్యూసీఎల్ విశేషమైన వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది ఇదే నెలలో 3.60 మిలియన్ టన్నులుగా ఉన్న బొగ్గు ఉత్పత్తి ఈ ఏడాది అక్టోబర్‌లో 5.93 మిలియన్ టన్నులకు పెరిగి 64.87 శాతం వృద్ధిని సాధించింది. సీఐఎల్‌లోని ప్రధాన అనుబంధ సంస్థలన్నింటిలో ఇదే అత్యధిక వృద్ధి. అంతేకాకుండా, నెలవారీ ఉత్పత్తి లక్ష్యంలో కూడా 108.60 శాతాన్ని సాధించింది.

2026 అక్టోబర్‌లో బొగ్గు సరఫరా గత ఏడాది ఇదే నెలలోని 4.44 మిలియన్ టన్నుల నుంచి 6.67 మిలియన్ టన్నులకు పెరిగి 50.16 శాతం వృద్ధి నమోదైంది. నెలవారీ సరఫరా లక్ష్యాన్ని అధిగమించిన ప్రధాన అనుబంధ సంస్థల్లో డబ్ల్యూసీఎల్ ఒక్కటే నిలిచింది. ఈ నెలలో నిర్దేశిత సరఫరా లక్ష్యంలో 102. 40 శాతాన్ని సాధించింది.

ఈ కాలంలో డబ్ల్యూసీఎల్ సాధించిన ప్రధాన విజయాల్లో గనుల వద్ద ఉన్న బొగ్గు నిల్వలను గణనీయంగా తగ్గించడం ఒకటి. 2026 ఏప్రిల్ 1న 13.034 మిలియన్ టన్నులుగా ఉన్న ఈ నిల్వలు, అక్టోబర్ 31 నాటికి 4.44 మిలియన్ టన్నులకు తగ్గాయి. ఫలితంగా సుమారు 8.6 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను ఖాళీ చేయగలిగింది. ఇది ప్రారంభ నిల్వల్లో దాదాపు 66 శాతానికి సమానం.

రైల్వే శాఖతో మెరుగైన సమన్వయం, వ్యాగన్ల (రేక్‌ల) కేటాయింపు, లోడింగ్ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ ఈ విజయానికి గణనీయంగా దోహదపడ్డాయి. 2026 అక్టోబర్ 31 నాటికి డబ్ల్యూసీఎల్ 6,146 రేక్‌లను లోడ్ చేసింది. గత ఏడాది ఇదే కాలంలో లోడ్ చేసిన 4,402 రేక్‌లతో పోలిస్తే ఇది 39.6 శాతం అధికం.విద్యుత్ రంగానికి రేక్‌ల ద్వారా బొగ్గు సరఫరా 40.8 శాతం పెరిగింది. ముఖ్యంగా మహాజెన్‌కోకు బొగ్గు సరఫరాలో గణనీయమైన వృద్ధి నమోదైంది.గనుల స్థాయిలో కార్యకలాపాలను నిరంతరం, సమగ్రంగా పర్యవేక్షించడం ద్వారా డబ్ల్యూసీఎల్ ఈ గణనీయమైన పనితీరును సాధించింది. బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఇతర కార్యాచరణ సమస్యలపై ప్రతిరోజూ సమీక్షలు నిర్వహించడం, ఏరియా జనరల్ మేనేజర్లతో క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేయడం, ఉన్నతాధి కారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించడం వల్ల కార్యకలా పాల్లో ఎదురయ్యే అవరోధాలను వేగంగా గుర్తించి పరిష్కరించడం సాధ్యమైంది.నెలవారీ సమన్వయ, సమీక్షా విధానాలను గనుల స్థాయి వరకు విస్తరించడం వల్ల జవాబు దారీ తనం మరింత బలోపేత మైంది. సంస్థ కార్యకలాపాల్లోని కీలక అంశాల పై మరింత నిశితమైన పర్యవేక్షణకు ఇది దోహదపడింది.

రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత మంత్రిత్వ శాఖలతో సన్నిహిత సమన్వయం కొనసాగించడం వల్ల పర్యావరణ, అటవీ అనుమతులు, భూమికి సంబంధించిన అంశాలు, ఇతర కార్యాచరణ అవసరాలకు సంబంధించిన సమస్యలను సకాలంలో పరిష్కరించడం కూడా సాధ్యమైంది.

2026 - 27 ఆర్థిక సంవత్సరంలో డబ్ల్యూసీఎల్ నాలుగు పర్యావరణ అనుమతులు లేదా వాటికి సంబంధించిన సవరణలు, రెండు అటవీ అనుమతులను పొందింది.

నిర్మల్ మహాపాదయాత్రకు బాసర బీజేపీ శ్రేణులు!

మండల అధ్యక్షుడు పుట్నాల సాయినాథ్ ఆధ్వర్యంలో తరలివెళ్లిన నాయకులు
పాదయాత్రలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



ఆదిలాబాద్, నవంబర్ 3: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మల్ మహా పాదయాత్రలో పాల్గొనేందుకు బాసర మండల బీజేపీ నాయకులు మంగళవారం బయలుదేరారు. మండల అధ్యక్షుడు పుట్నాల సాయినాథ్ ఆధ్వర్యంలో, మహాపాదయాత్ర మండల ఇన్‌చార్జి సతీష్‌రావు నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు బాసర నుంచి నిర్మల్‌కు పాదయాత్రగా తరలివెళ్లారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ డైరెక్టర్ ఎస్. సాయిబాబా, కిసాన్ మండల అధ్యక్షుడు మనోహర్‌రావు, మండల ఉపాధ్యక్షులు కె. గంగాధర్, చిన్న లింగం, భగవంతరావు, కె. పోతన్న, శివ, ఎం. నితిన్, సీహె చ్. సాయినాథ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశోధన, వ్యవసాయ విస్తరణతో సాగు లాభదాయకత పెరగాలి, జీవనోపాధి మెరుగుపడాలి: డీఏఆర్ఈ కార్యదర్శి డాక్టర్ ఎం. ఎల్. జాట్



"మారుతున్న ప్రపంచంలో ఆహారం, దాణా, పశుగ్రాసం, ఇంధనం, సుస్థిరత కోసం మొక్కజొన్న విప్లవం" (ఎం4 ఎఫ్ఎస్) అనే ఇతివృత్తంతో తొలి అంతర్జాతీయ మొక్కజొన్న సదస్సు హైదరాబాద్‌లోని జేడీ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం ప్రారంభమైంది. మొక్కజొన్న పరిశోధన, ఉత్పాదకత, విలువ గొలుసు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే వ్యూహాలపై చర్చించేందుకు శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, వ్యవసాయ సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులను ఈ సదస్సు ఒక వేదికపైకి తీసుకొచ్చింది.

అధిక దిగుబడినిచ్చే రకాలు, హైబ్రిడ్లు, మెరుగైన పోషక నాణ్యత, వనరుల సమర్థ వినియోగం, యాంత్రీకరణ, పటిష్టమైన విత్తన వ్యవస్థలు, ఆహారం, దాణా, పశుగ్రాసం, ఇంధన భద్రతలో మొక్కజొన్నకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని సదస్సు ప్రముఖంగా ప్రస్తావించింది.

సదస్సులో డీఏఆర్ఈ కార్యదర్శి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం. ఎల్. జాట్ ప్రసంగిస్తూ... గత దశాబ్దంలో దేశంలో మొక్కజొన్న ఉత్పాదకత గణనీయంగా పెరిగి, ఉత్పత్తి సుమారు 55 మిలియన్ టన్నులకు చేరిందని అన్నారు. ఈ మేరకు కృషి చేసిన మొక్కజొన్న పరిశోధకులను అభినందించారు. సాంకేతిక ఆవిష్కరణలు, మెరుగైన పంట నిర్వహణ, వనరుల సమర్థ వినియోగం ద్వారా ఉత్పాదకతను మరో 1.5 రెట్లు పెంచడంతో పాటు, రాబోయే దశాబ్దంలో ఉత్పత్తిని 75 మిలియన్ టన్నులకు పెంచాలని పిలుపునిచ్చారు.

ఆహారం, దాణా, పశుగ్రాసం, ఇంధనం అనే సంప్రదాయ 4ఎఫ్ దృక్పథాన్ని, రైతులను కేంద్రంగా చేర్చి 5ఎఫ్‌గా విస్తరించాలని డాక్టర్ జాట్ నొక్కిచెప్పారు. పరిశోధన, వ్యవసాయ విస్తరణ ఫలితాలు సాగు లాభదాయకతను పెంచి, జీవనోపాధులను మెరుగుపరచాలని అన్నారు. ముఖ్యంగా పంట నిర్వహణకు సంబంధించి ఏర్పడే దిగుబడి అంతరాలను తగ్గించేందుకు సిస్టమ్స్-సైన్స్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఇతర ముఖ్యమైన పంటలకు, ప్రత్యేకించి నూనెగింజలు, పప్పుధాన్యాలకు భంగం కలగకుండా వివిధ వంట కాలాలు, వ్యవసాయ పర్యావరణ మండలాల్లో మొక్కజొన్న సాగుపై వ్యూహాత్మకంగా దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, ముఖ్యంగా ప్రభుత్వ రంగ హైబ్రిడ్ విత్తనాలు, అందుబాటు ధరల్లో లభించేందుకు పటిష్టమైన విత్తన వ్యవస్థ అవసరమని కూడా స్పష్టం చేశారు.

ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (క్రాప్ సైన్స్) డాక్టర్ డి. కే. యాదవ్ మాట్లాడుతూ... ఆహార, పోషక, ఇంధన భద్రతకు మొక్కజొన్నను ముఖ్యమైన పంటగా అభివర్ణించారు. గత ఐదేళ్లలో 329 మొక్కజొన్న హైబ్రిడ్ల అభివృద్ధితో సహా పరిశోధన, వ్యవసాయ విస్తరణలో సాధించిన పురోగతిని గుర్తుచేశారు. ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఆన్ మేజ్‌ను (ఏఐసీఆర్పీ ఆన్ మేజ్) బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అధిక దిగుబడి, మెరుగైన పోషక నాణ్యత, జీవ, నిర్జీవ కారకాల ఒత్తిళ్లను తట్టుకునే గుణాలున్న రకాల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలన్నారు. సాగు ఉత్పాదకాల సమర్థ వినియోగం, యాంత్రీకరణ, సామర్థ్యాల పెంపు, ప్రభుత్వ రంగ హైబ్రిడ్ విత్తనోత్పత్తిని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఇథనాల్‌కు ముడిపదార్థంగా మొక్కజొన్న సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకునేందుకు పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల మధ్య సహకారం అవసరమని కూడా వివరించారు.

సీఐఎంఎంవైటీతో అనుబంధం ఉన్న ప్రముఖ మొక్కజొన్న శాస్త్రవేత్త, ప్రపంచ ఆహార పురస్కార గ్రహీత పద్మశ్రీ డాక్టర్ ఎన్. వానల్ మాట్లాడుతూ... రైతుల అవసరాలకు తగిన మెరుగైన రకాలు, హైబ్రిడ్లను వేగంగా అభివృద్ధి చేసేందుకు సరళమైన, తక్కువ ఖర్చుతో ఫలితాలనిచ్చే పద్ధతులను అనుసరించాలని సూచించారు.

అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం!

కమిషనర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ అధికారులు

రోడ్లపైకి చొచ్చుకొచ్చిన నిర్మాణాల కూల్చివేత.. అక్రమ నిర్మాణదారుల్లో గుబులు



ఖమ్మం, నవంబర్ 3:ఖమ్మం నగరంలో అక్రమ నిర్మాణాలపై నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో కఠినంగా వ్యవహరించారు. ఆయన ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు సోమవారం నగరంలోని గట్టయ్య సెంటర్ ప్రాంతంలో కూల్చివేతలు చేపట్టారు. అనుమతులు లేకుండా, నిబంధనలను ఉల్లంఘిస్తూ రహదారులపైకి చొచ్చుకొచ్చి నిర్మించిన కట్టడాలను తొలగించారు. అక్రమ నిర్మాణాల విషయంలో ఉపేక్షించేది లేదన్న సంకేతాలను ఈ చర్యల ద్వారా అధికారులు స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ విభాగం నేరుగా క్షేత్రస్థాయిలోకి దిగి కూల్చివేతలు చేపట్టడం నగరంలో చర్చనీయాంశమైంది.

నగరంలో కొందరు నిర్మాణదారులు భవన నిర్మాణ అనుమతులను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. రహదారుల హద్దులను దాటి నిర్మాణాలు చేపడుతూ ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఫలితంగా పలు ప్రాంతాల్లో రహదారులు ఇరుకుగా మారి వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఇలాంటి నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ కట్టడాలను గుర్తించి కూల్చివేతలు చేపట్టారు. రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఎంతటివారైనా చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్న కమిషనర్ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ విభాగం అప్రమత్తమైంది. క్షేత్రస్థాయిలో నిర్మాణాలను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కట్టడాల తొలగింపునకు చర్యలు చేపట్టింది. అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు, రహదారుల హద్దులు దాటి చేపట్టిన నిర్మాణాలపై దృష్టి సారించింది. అధికారులు కేవలం హెచ్చరికలతో సరిపెట్టకుండా కూల్చివేతలకు దిగడం ప్రాధాన్యం సంతరించుకుంది. నగరంలో ఎక్కడైనా ఇలాంటి అక్రమ నిర్మాణాలు ఉంటే గుర్తించి ఏర్పడింది. నగరంలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే నిర్మాణాలపై యంత్రాంగం చర్యలు తీసుకుంటోందనే సంకేతాలు వెలువడ్డాయి.


నగరంలో అక్రమ నిర్మాణాలపై చేపట్టిన కూల్చివేతలు ఒక్కరోజుకే పరిమితం కాకూడదని ప్రజలు కోరుతున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని సూచిస్తున్నారు. రహదారులను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పలుకుబడి, రాజకీయ అండదండలు ఉన్నాయనే కారణంతో ఎవరినీ ఉపేక్షించకూడదని అభిప్రాయపడుతున్నారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇదే తరహాలో చర్యలు కొనసాగిస్తూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుందని ఆశిస్తున్నారు. కేవలం కూల్చివేతలే కాకుండా భవన నిర్మాణ అనుమతుల జారీ నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాలని కోరుతున్నారు. రహదారులు ఆక్రమణల నుంచి విముక్తి పొంది ప్రజలకు ఇబ్బందులు లేని రవాణా సౌకర్యం కల్పించినప్పుడే అధికారుల చర్యలకు సార్థకత చేకూరుతుందని పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రసాద్, టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ రోజారెడ్డి, బిల్డింగ్ ఇన్స్పెక్టర్లు శశి, దివ్య, దుర్గనాయి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చింతకానిని కరువు మండలంగా ప్రకటించాలి

11 డిమాండ్లతో సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల పెంపు, రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



ఖమ్మం, నవంబర్ 3:చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పాటు అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం సీపీఐ చింతకాని మండల సమితి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నందున చింతకాని మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, వృద్ధాప్య పింఛన్లను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్లను రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయడంతో పాటు గతంలో మంజూరైన రూ.15.50 కోట్ల దళితబంధు నిధులను 155 దళిత కుటుంబాలకు వెంటనే విడుదల చేయాలని కోరారు.

అలాగే 3,800 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పేదలకు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులతో పాటు ప్రతి ఒక్కరికీ 12 కిలోల రేషన్ బియ్యం పంపిణీ చేయాలని కోరారు.

వెంకటాయపాలెం నుంచి కొదుమూరు వరకు ప్రతిపాదించిన 100 అడుగుల రహదారి విస్తరణను గ్రామాల్లో 50 అడుగులకే పరిమితం చేయాలని, చిన్నమండవ గ్రామంలో మున్నేరు నుంచి జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండవర్తి గోవిందరావు, ఏఫూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్, కూచిపూడి రవి, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, జిల్లా సమితి సభ్యులు పర్చా రామచంద్రరావు, నారపోగు హేమ, మండల సహాయ కార్యదర్శులు మార్గం శ్రీను, అబ్బూరి మహేష్, నాయకులు పగిడిపల్లి ఏసు, దొబ్బల వెంగళరావు, పదిలం వెంకటనరసయ్య, గోగుల ఆది, గోగుల వెంకట్రావు, హుస్సేన్, గుండ్ల బేబీ రాణి, బస్వాపురం సర్పంచ్ ఆవుల నరసింహారావు, తుపాకుల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.21,800 కోట్ల విలువైన పుణె మెట్రో ప్రాజెక్టులకు నవంబర్ 3న ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 3:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2026 నవంబర్ 3వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సుమారు రూ.21,800 కోట్ల విలువైన పుణె మెట్రో ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు, పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. ఈ సందర్భంగా ఆయన సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

రూ.8,300 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన పుణె మెట్రో లైన్ - 3 (పింక్ లైన్)ను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. సాంకేతిక ఆవిష్కరణలు, ఆధునిక రవాణా పరిష్కారాల ద్వారా పుణె నగర ప్రజా రవాణా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా ఈ ప్రాజెక్టు కీలక ముందడుగుగా నిలవనుంది.

సుమారు 23 కిలోమీటర్ల పొడవున విస్తరించిన పింక్ లైన్ మాన్ నుంచి డిస్ట్రిక్ట్ కోర్టు మెట్రో స్టేషన్ వరకు అనుసంధానం కల్పిస్తుంది. ఈ మార్గం ద్వారా హింజేవాడి ఐటీ హబ్ నుంచి శివాజీనగర్ వరకు మెట్రో ప్రయాణ సదుపాయం అందుబాటులోకి రానుంది. దీంతో పుణెలోని ప్రధాన ఉద్యోగ కేంద్రాల్లో ఒకటైన హింజేవాడికి రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు వేలాది మంది ఐటీ నిపుణులు, ఇతర ప్రయాణికుల రోజువారీ ప్రయాణానికి సౌకర్యం కలగనుంది. ఈ మెట్రో మార్గం ఇప్పటికే ఉన్న మెట్రో నెట్‌వర్క్‌తో అనుసంధానమై పుణె నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య నిరంతర రవాణా సదుపాయాన్ని కల్పించనుంది. ప్రైవేటు వాహనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, ట్రాఫిక్ రద్దీని, వాహనాల నుంచి వెలువడే కాలుష్య ఉద్గారాలను తగ్గించడం, ప్రధాన వాణిజ్య, నివాస ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడం వంటి ప్రయోజనాలు చేకూరనున్నాయి.

పింక్ లైన్‌లో మహిళా సాధికారతకు, లింగ సమానత్వంతో కూడిన ప్రజా రవాణా వ్యవస్థకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వడం విశేషం. దేశంలోనే తొలిసారిగా చేవడు తున్న వినూత్న ప్రయత్నంగా ఈ మెట్రో మార్గాన్ని పూర్తిగా మహిళా రైలు ఆపరేటర్లే నిర్వహించనున్నారు. పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ ప్రాజెక్టు ప్రాధాన్యమిస్తోంది. దీనికి అవసరమైన మొత్తం విద్యుత్‌లో సుమారు 30 శాతాన్ని సౌర విద్యుత్ ద్వారా సమకూర్చాలని లక్ష్యంగా నిర్దేశించారు.

సుమారు రూ.13,500 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయనున్న పుణె మెట్రో రెండో దశకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. ఈ దశలో మెట్రో లైన్లు 2ఏ, 2బీ, 4, 4ఏ ఉన్నాయి. వీటి నిర్మాణంతో నగర మెట్రో నెట్‌వర్క్ గణనీయంగా విస్తరించడంతో పాటు, ప్రధాన నివాస, వాణిజ్య, ఐటీ కేంద్రాల మధ్య రవాణా అనుసంధానం మరింత బలోపేతం కానుంది.

రెండో దశలోని 2ఏ, 2బీ మెట్రో లైన్లు మొత్తం సుమారు 12.75 కిలోమీటర్ల పొడవున విస్తరించనున్నాయి. లైన్ 2ఏ వనాజ్ నుంచి చాందనీ చౌక్ వరకు, లైన్ 2బీ రామ్‌వాడీ నుంచి విఠల్‌వాడీ వరకు అనుసంధానం కల్పిస్తాయి. దీంతో ప్రస్తుతం ఉన్న తూర్పు, పశ్చిమ మెట్రో నెట్‌వర్క్ మరింత విస్తరించనుంది. సుమారు 25.52 కిలోమీటర్ల పొడవైన లైన్ - 4 ఖరాడీ నుంచి ఖడక్‌వాస్లా వరకు అనుసంధానం కల్పిస్తుంది. 6.12 కిలోమీటర్ల పొడవైన లైన్ - 4ఏ నల్ స్టాప్ నుంచి మాణిక్ బాగ్ వరకు మెట్రో సేవలను అందుబాటులోకి తీసుకురానుంది.

కొత్త మెట్రో మార్గాలు ఖరాడీ, మగర్‌పట్టా, హడప్సర్, స్వర్గేట్, మాణిక్ బాగ్, నాందేడ్ సిటీ, పుణె కంటోన్మెంట్, వార్జే వంటి పలు కీలక ప్రాంతాలను అనుసంధానించనున్నాయి. రామ్‌వాడీ నుంచి విఠల్‌వాడీ వరకు చేపట్టనున్న తూర్పు వైపు విస్తరణతో ఖరాడీ, వాఘోలీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాస, వాణిజ్య, ఐటీ కేంద్రాలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది. స్వర్గేట్, నల్ స్టాప్, ఖరాడీ బైపాస్ వద్ద ఏర్పాటు చేసే ఇంటర్‌చేంజ్ సదుపాయాల ద్వారా ఈ మెట్రో మార్గాలు అంతరాష్ట్ర బస్సు సేవలతో పాటు, ప్రస్తుతం ఉన్న పుణె మెట్రో నెట్‌వర్క్‌తో అనుసంధానం కానున్నాయి. తద్వారా నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణం మరింత సులభతరం కానుంది.

ఈ ప్రాజెక్టులు పుణె ప్రజా రవాణా మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య రవాణా అనుసంధానాన్ని మెరుగుపరచనున్నాయి. ప్రయాణికులకు సమర్థవంతమైన, సమగ్ర పట్టణ రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నాయి.

భారత్ సౌర ఇంధన ప్రస్థానం సరికొత్త అవకాశాలను అందిస్తోందని తెలియజేస్తున్న వ్యాసాన్ని ప్రస్తావించిన ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, నవంబర్ 3:భారతదేశ సౌర ఇంధనం ఏ విధంగా సరికొత్త అవకాశాలను అందిస్తున్నదీ వివరిస్తూ కేంద్ర మంత్రి శ్రీ ప్రల్హాద్ జోషీ రాసిన వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రస్తావించారు. ఆ వ్యాసం 'పీఎమ్ సూర్య ఘర్', 'పీఎమ్-కుసుమ్' వంటి కార్యక్రమాలతో భారతదేశంలో సౌర ఇంధన రంగం స్ఫూర్తిని పొంది, శరవేగంగా వృద్ధి చెందుతున్న తీరును వివరించిందని శ్రీ మోదీ అన్నారు."భారత్ 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన లక్ష్య సాధన దిశగా దూసుకు పోతోందని, ఈ క్రమంలో వ్యవసాయ రంగంలో సౌర ఇంధనం భూమిక, ఇంధన నిల్వ మొదలుకొని తయారీ రంగం, పర్యావరణానుకూల ఉపాధి కల్పన వరకు.. వివిధ రంగాలలో ముందు ముందు ఎలాంటి మార్పులు చోటు చేసుకోబో తాయో ఆయన ప్రస్తావించారు" అని శ్రీ మోదీ అన్నారు.సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి పొందుపరుస్తూ:

భారతదేశంలో సౌర ఇంధన రంగం పురోగతి కొత్త కొత్త అవకాశాలను అందిస్తోంది.

'పీఎమ్ సూర్య ఘర్', 'పీఎమ్-కుసుమ్' వంటి కార్యక్రమాలతో స్ఫూర్తిని పొంది భారత దేశంలో సౌర ఇంధనం వృద్ధి చెందుతున్న తీరుతెన్నులను గురించి కేంద్ర మంత్రి శ్రీ ప్రల్హాద్ జోషీ వివరించారు.

రాబోయే కాలంలో చోటు చేసుకోగల పరిణామాలను గురించి కూడా ఆయన తెలిపారు. భారత్ 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయం, ఇంధన నిల్వ, తయారీ రంగం, పర్యావరణానుకూల ఉద్యోగ కల్పనలలో సౌర ఇంధనం పోషించే పాత్రను వ్యాసంలో తెలిపారు'' అని పేర్కొన్నారు.

చౌటుప్పల్‌లో పూజారి దారుణ హత్య..

నల్గొండ, నవంబర్ 3:చౌటుప్పల్ పట్టణంలో కలకలం రేపిన పూజారి రాళ్లబండి సుధాకర్ స్వామి దారుణ హత్య, భారీ చోరీ కేసును పోలీసులు కేవలం మూడు గంటల్లోనే ఛేదించారు. హత్యకు పాల్పడి కోట్లాది రూపాయల విలువైన సొత్తుతో పారిపోతున్న ఇద్దరు నిందితులను నిర్మల్ జిల్లా గంజాల్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. చౌటుప్పల్ డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఘటన వివరాలను వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం.. స్థానికంగా ఉండే సుధాకర్ స్వామి ఇంట్లో దేవుడి పూజలు, కొలుపులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఆయన వద్దకు వచ్చే భక్తులు కానుకలుగా సమర్పించిన బంగారం, నగదు ఇంట్లో ఉండేవి.

అక్టోబర్ 31వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో సుధాకర్ స్వామితో ఆయన మేనమామ వరుసయ్యే గుర్రం సురేష్ ఫోన్‌లో మాట్లాడాడు. ఆ సమయంలో పవన్, హర్ష అనే ఇద్దరు వ్యక్తులు తన వద్దకు వచ్చారని సుధాకర్ స్వామి చెప్పాడు.

మోడల్ పార్లమెంట్ పోస్టర్ విడుదల

యువతకు పార్లమెంట్ చర్చల్లో పాల్గొనే అవకాశం!

'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026?27' పోస్టర్ విడుదల

'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' అంశంపై చర్చా కార్యక్రమం

18 నుంచి 25 ఏళ్ల యువతకు అవకాశం.. మూడు నిమిషాల ప్రసంగ సమయం

నల్గొండ, నవంబర్ 3:యువతలో ప్రజాస్వామ్య, పార్లమెంటరీ వ్యవస్థలపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026?27' కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. మై భారత్ కేంద్రం సూర్యాపేట జిల్లా నిర్వాహకుల ఆధ్వర్యంలో నవంబర్ 4న సూర్యాపేటలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి కార్యక్రమం జరగనుంది.

కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వేముల వెంకటేశ్వర్లు, మై భారత్ కేంద్రం జిల్లా ఇన్‌చార్జి దిగూటి భవాని నేతృత్వంలో పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రణబోతు పిచ్చిరెడ్డి మాట్లాడుతూ.. 18 నుంచి 25 ఏళ్ల వయసున్న విద్యార్థులు, యువత ఈ మోడల్ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనవచ్చని తెలిపారు.'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరికీ మాట్లాడేందుకు మూడు నిమిషాల సమయం మాత్రమే ఉంటుందని వివరించారు.

బెంగళూరు-ముంబయి వందేభారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించిన కేంద్రమంత్రి

న్యూ ఢిల్లీ, నవంబర్ 3: ఎస్ఎంవీటీ బెంగళూరు-ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ (సీఎస్ఎంటీ), ముంబయి వందేభారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్‌ను కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ ఇవాళ ప్రారంభించారు. కేంద్రమంత్రులు శ్రీ ప్రహ్లాద్ జోషి, శ్రీ హెచ్.డీ. కుమారస్వామి, రైల్వే శాఖ సహాయ మంత్రి శ్రీ వి. సోమన్న, సహాయ మంత్రి సుశ్రీ శోభా కరంద్లాజే తదితర ప్రముఖుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. దేశంలోని రెండు ప్రముఖ మహానగరాలు, ఆర్థిక కేంద్రాల మధ్య ఓవర్ నైట్ ఆధునిక రైలు అనుసంధానతను బలోపేతం చేయటంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం కీలకంగా నిలిచింది.

ఈ తదుపరి తరం స్లీపర్ రైలు సర్వీసు ద్వారా బెంగళూరు - ముంబయి మధ్య ప్రయాణించే వారికి మరింత ఆధునిక, సౌకర్యవంతమైన, సమర్థవంతమైన ప్రయాణమార్గం అందుబాటులోకి వస్తుంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలోని ముఖ్యమైన ప్రాంతీయ కేంద్రాల మధ్య రవాణా సౌకర్యాలను బలోపేతం చేస్తూనే.. నిపుణులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, విద్యార్థులు, వాణిజ్యకారులు, పర్యాటకులకు ఈ సర్వీసు ప్రయోజనకరంగా ఉంటుంది.

2026 జనవరిలో హౌరా-గౌహతి మార్గంలో వందేభారత్ స్లీపర్ సేవలను ప్రారంభించిన తర్వాత నిన్న వారణాసి-న్యూఢిల్లీ వందేభారత్ స్లీపర్ రైలును ప్రారంభించారు. ఇప్పుడు బెంగళూరు-ముంబయి సర్వీసు ఓవర్ నైట్ ఆధునిక రైలు ప్రయాణ వ్యవస్థను మరింత విస్తరిస్తోంది. ప్రయాణికులే కేంద్రంగా సాగే ప్రయాణ సౌకర్యాలపై భారత రైల్వేల నిబద్ధతను ఇది మరింత బలపరుస్తుంది.

బెంగళూరు-ముంబయి వందేభారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం గురించి శ్రీ అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ... దేశ ఐటీ, అంకుర సంస్థల రాజధాని బెంగళూరును, ఆర్థిక రాజధాని ముంబయితో ఈ సర్వీసు అనుసంధానిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, గుంతకల్లు, కర్ణాటకలోని రాయచూరు, యాదగిరి, కలబురగి, మహారాష్ట్రలోని సోలాపూర్, పూణే, కళ్యాణ్ మీదుగా ఈ రైలు నడుస్తుందని చెప్పారు. గతంలో ఎలాంటి ప్రీమియం, ప్రపంచ స్థాయి రైలు సేవల సౌకర్యం లేని ఉత్తర కర్ణాటకలోని ఎన్నో ప్రాంతాలకు ఇది ఓవర్ నైట్ అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని చెప్పారు. కర్ణాటక నుంచి ప్రారంభం కానున్న తదుపరి వందేభారత్ స్లీపర్ సర్వీసు బెంగళూరు నుంచి బయలుదేరి కర్ణాటకలోని ఉత్తర ప్రాంతాల మీదుగా హుబ్బళ్లిని కలుపుతూ పూణే, ముంబయి దిశగా వెళుందని ఆయన ప్రకటించారు.

విద్యుద్దీకరణ పూర్తి కావడంతో పాటు ఈ మార్గంలో విజయవంతంగా పరీక్షలు నిర్వహించిన నేపథ్యంలో బెంగళూరు-మంగళూరు మధ్య వందేభారత్ సేవలు కొన్ని వారాల్లోనే ప్రారంభం కానున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. బెంగళూరు, తీరప్రాంత కర్ణాటక మధ్య అనుసంధానాన్ని, బెంగళూరును పూణేతో అనుసంధానించే రైలు మార్గాన్ని కేంద్రమంత్రి శ్రీ హెచ్.డి. కుమారస్వామి స్వాగతించారు. ఈ సర్వీసులు కర్ణాటక ప్రజలకే కాక బెంగళూరులో నివసిస్తున్న పశ్చిమబెంగాల్, అస్సాం, బీహార్ వంటి రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులకు, కుటుంబాలకు ప్రయోజనకరంగా ఉంటాయని, ప్రయాణికుల సౌలభ్యాన్ని, ప్రాంతీయ అనుసంధానాన్ని మెరుగుపరుస్తాయని అభిప్రాయపడ్డారు.

కర్ణాటకలో రైల్వే మౌలిక సదుపాయాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని రైల్వే శాఖ సహాయమంత్రి శ్రీ వి. సోమన్న తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయటం, రైలు అనుసంధానాన్ని బలోపేతం చేయటం, రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచటంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో సుమారు రూ. 52,000 కోట్ల విలువైన రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. రైలు సేవలను పునరుద్ధరించటంలో, రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, అండర్‌బ్రిడ్జిల నిర్మాణాన్ని వేగవంతం చేయటంలో, బెంగళూరుతో పాటు జిల్లా కేంద్రాలు, ఇతర ముఖ్యమైన కేంద్రాల్లో రైల్వేస్టేషన్లను ఆధునీకరించటంలో రైల్వే మంత్రి చేస్తున్న కృషిని అభినందించారు.

నమాచార సాంకేతికత, నూతన ఆవిష్కరణలు, విద్య, పారిశ్రామిక రంగానికి ప్రముఖ కేంద్రమైన బెంగళూరు... దేశ ఆర్థిక, వాణిజ్య రాజధాని ముంబయి మధ్య నూతన వందేభారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలు కీలకమైన ఓవర్ నైట్ రైలు మార్గ సదుపాయాన్ని కల్పిస్తుంది.

ఈ రెండు మహానగరాల మధ్య నిపుణులు, పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు, వ్యాపారులు, కుటుంబాలు పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నూతన సర్వీసు ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది. దీనిద్వారా ప్రయాణికులు సుదూర ప్రాంతాలకు రాత్రిపూట ప్రయాణించి, మరుసటి రోజు ఉదయానికి గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

ఈ రైలు అనంతపురం, గుంతకల్లు, రాయచూరు, యాదగిరి, వాడి, కలబురగి, సోలాపూర్, పూణే, కల్యాణ్ తదితర కీలక స్టేషన్ల ద్వారా వెళ్తుంది. ఇది కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర పరిధిలోని ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయటంతో పాటు ముఖ్యమైన వాణిజ్య, విద్యా, ప్రాంతీయ కేంద్రాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఈ రైలు బెంగళూరులోని ఎస్ఎంవీటీ నుంచి 19:45 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు 11:55 గంటలకు ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సీఎస్ఎమ్‌టీ నుంచి 20:10 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు 12:00 గంటలకు బెంగళూరు ఎస్ఎంవీటీకి చేరుకుంటుంది. వారంలో ఆరు రోజుల పాటు ఈ సర్వీసు నడుస్తుంది. బెంగళూరు నుంచి బయలుదేరే రైలుకు సోమవారం, ముంబయి నుంచి బయలుదేరే రైలుకు మంగళవారం రోజున సర్వీసు ఉండదు.

ఈ రాత్రిపూట ప్రయాణ సమయం వల్ల ప్రయాణికులు సౌకర్యవంతంగా ప్రయాణిస్తూనే, పగటి సమయాన్ని మరింత సద్వినియోగం చేసుకునేందుకు వీలవుతుంది. ఈ మార్గంలోని వివిధ నగరాలు, పట్టణాల ప్రజలు కూడా ఈ నూతన ఆధునిక రైలు ప్రయాణ సదుపాయం ద్వారా లబ్ధి పొందుతారు.

ఆధునిక మౌలిక వసతులు, అత్యాధునిక సాంకేతికత, మెరుగైన అనుసంధానంతో ప్రయాణ రంగాన్ని మార్చాలన్న భారత రైల్వే నిరంతర కృషిలో భాగంగా బెంగళూరు-ముంబయి వందేభారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం మరో కీలక ఘట్టంగా నిలిచింది. భారతదేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడుతూ, మహానగరాలను అభివృద్ధి చెందుతున్న ప్రాంతీయ కేంద్రాలతో అనుసంధానించే ఆధునిక, సమర్థవంతమైన, సురక్షితమైన, ప్రయాణికుల కేంద్రంగా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు భారత రైల్వే కట్టుబడి ఉంది.

భారత పునరుత్పాదక ఇంధన సదస్సు- ప్రదర్శనను ప్రారంభించిన ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, నవంబర్ 3:న్యూ ఢిల్లీలోని భారత్ మండపంలో 'భారత పునరుత్పాదక ఇంధన సదస్సు, ప్రదర్శన - 2026'ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభించారు. సదస్సుకు దేశ విదేశాల నుంచి వచ్చిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, అంకుర సంస్థల ప్రతినిధులు, ఉన్నతాధికారులనుద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. ప్రపంచవ్యాప్త ఇంధన సంక్షోభాల నేపథ్యంలో పునరుత్పాదక ఇంధనం ప్రాధాన్యతను గుర్తిస్తూ ఈ ఏడాది సదస్సు ప్రత్యేక పరిస్థితుల మధ్య జరుగుతోందని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ 9వ అసెంబ్లీతో పాటు, 4వ గ్రీన్ హైడ్రోజన్ కాన్ఫరెన్స్ ప్రతినిధులూ ఇందులో పాల్గొనడం వల్ల ఈ ఏడాది సదస్సు పరిధి మరింత విస్తృతమైందని ఆయన వివరించారు.

కరోనా మహమ్మారి నుంచి ప్రస్తుత పశ్చిమాసియా సంక్షోభం వరకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఊహించని ఆటంకాలను ఎదుర్కొందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ అలజడులను సమరంగా ఎదుర్కొంటూనే, భారత్ అత్యధిక ఆర్థిక వృద్ధిని కొనసాగించడం 140 కోట్ల మంది భారతీయులకు గర్వకారణమైందని ఆయన అన్నారు. గత పదేళ్లుగా పరిశుద్ధ ఇంధన రంగంలో దేశీయంగా పెట్టిన నిరంతర పెట్టుబడులు, చేపట్టిన వ్యవస్థాగత సంస్కరణలే మన దేశాన్ని తీవ్రమైన బాహ్య సంక్షోభాల నుంచి రక్షించాయని ఆయన స్పష్టం చేశారు. 'గత దశాబ్ద కాలంలో భారత్ పరిశుద్ధ ఇంధనంపై పెట్టుబడులు పెట్టకుండా, దీని కోసం కొత్త వ్యవస్థలను నిర్మించకుండా ఉండి ఉంటే... మన సంక్షోభం ప్రపంచంలోని మిగతా దేశాల కంటే చాలా తీవ్రంగా ఉండేది' అని ప్రధానమంత్రి శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఇంధన భద్రతకు, ఆర్థిక భద్రతకు మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని ఇటీవలి ప్రపంచ సంక్షోభాలు నిరూపించాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. శిలాజ ఇంధనాలపై అతిగా ఆధారపడటం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పదేపదే దెబ్బతింటుందని ఆయన హెచ్చరించారు. ఈ ఇంధన నిల్వలు పరిమితమైనవి, కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఉన్నాయి... ఈ బలహీనతతో పోలిస్తే, పరిశుద్ధ ఇంధనం అపరిమితమైనది, అందరికీ అందుబాటులో ఉండే శక్తినీ కలిగి ఉందని శ్రీ మోదీ వివరించారు. 'ఇంధన భద్రత భవిష్యత్తు పరిశుద్ధ ఇంధనంతోనే ముడిపడి ఉందని మనందరికీ తెలుసు' అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

గత 12 ఏళ్లుగా పరిశుద్ధ ఇంధన రంగంలో భారత్ ప్రయాణం మాట, కృషి, ఫలితం అనే మూడు సూత్రాలతో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి వివరించారు. 2030 నాటికి శిలాజేతర వనరుల ద్వారా 500 గిగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని సీఓపీ-26 నిర్ణయించడమే దీనికి నిదర్శనమన్నారు. 2030 నాటికి తన మొత్తం విద్యుత్ సామర్థ్యంలో సగభాగాన్ని శిలాజేతర వనరుల ద్వారా పొందాలనే పారిస్ ఒప్పంద లక్ష్యాన్ని భారత్ నిర్దేశిత సమయం కంటే అయిదేళ్ల ముందే, అంటే 2025లోనే సాధించిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం 50 శాతానికి పైగా శిలాజేతర విద్యుత్ సామర్థ్యంతో... సౌర, పునరుత్పాదక ఇంధన రంగాల్లో ప్రపంచంలోనే తొలి మూడు దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందని శ్రీ మోదీ తెలిపారు. 500 గిగావాట్ల లక్ష్యానికి గానూ ఇప్పటికే దాదాపు 300 గిగావాట్ల లక్ష్యం సాధించామనీ, రాబోయే 10 నుంచి 11 ఏళ్లలో మరో 500 గిగావాట్ల నూతన శిలాజేతర సామర్థ్యాన్ని జోడించాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఆయన ఉద్ఘాటించారు. 'ఈ లక్ష్యం కొంచెం కష్టమైనదే, కానీ నా దేశ సామర్థ్యంపై నాకు పూర్తి నమ్మకం ఉంది. అందుకే చెబుతున్నా, మనం దీనిని సాధించి తీరుతాం!' అని ప్రధానమంత్రి శ్రీ మోదీ ధీమా వ్యక్తం చేశారు.

భారత్ సాధించిన సరికొత్త ఆవిష్కరణలు, అనుభవాల ఫలాలు విశ్వమానవాళి అంతటికీ చెందాలన్నదే మన సంకల్పమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. హరిత ఇంధన రంగంలో మన ప్రయాణం కేవలం స్వార్థంతో కాకుండా లోకకల్యాణ సహకార స్ఫూర్తితో సాగుతోందన్న శ్రీ మోదీ... దీనికి పలు ఉదాహరణలను ఉటంకించారు. 'ఈ ప్రయాణంలో భారత్ అందుకున్న విజయ శిఖరాలు... రేపు ప్రపంచంలోని ఎన్నో దేశాలకు దిక్సూచిగా, తోడ్పాటుగా నిలుస్తాయి' అని శ్రీ మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

కోటి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు లక్ష్యంతో 2024 ఫిబ్రవరి నెలలో ప్రారంభించిన 'పీఎమ్ సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన' సాధిస్తున్న వేగవంతమైన పురోగతినీ ప్రధానమంత్రి వివరించారు. కేవలం 24 నుంచి 25 నెలల వ్యవధిలోనే 65 లక్షలకు పైగా కుటుంబాలు ఈ ఉద్యమంలో భాగస్వామ్యం పొందాయనీ... ప్రతి ఆరు రోజులకు ఒక లక్ష కొత్త ఇళ్లు ఈ పథకంలో చేరుతున్నాయనీ ఆయన పేర్కొన్నారు. దీనివల్ల విద్యుత్ బిల్లులు దాదాపు 76 శాతం తగ్గాయని సూచించిన ఒక అధ్యయనాన్ని శ్రీ మోదీ ఉటకించారు. లక్షలాది కుటుంబాలకు కరెంటు బిల్లు పూర్తిగా 'సున్నా' అవ్వడమే కాకుండా, మిగిలిన అదనపు విద్యుత్తును గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా వారు ఆదాయం పొందుతున్నారని ప్రధానమంత్రి తెలిపారు. 'మన దేశానికి చెందిన ఈ పథకం ప్రపంచంలోని అనేక దేశాల ఇంధన భద్రతకు ఎంతో బలాన్ని చేకూరుస్తుంది' అని శ్రీ మోదీ అభిప్రాయపడ్డారు.

గత 12 ఏళ్లుగా దైనందిన జీవితంలో, పరిశ్రమల్లో, వ్యవసాయ రంగంలో సౌరశక్తిని భాగం చేయడానికి జరుగుతున్న కృషిని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. 44,000కు పైగా ప్రభుత్వ భవనాలకు సౌరశక్తిని అనుసంధానించడం ద్వారా ఏటా దాదాపు 700 కోట్ల రూపాయలు ఆదా అవుతున్నాయని ఆయన గుర్తుచేశారు. అలాగే 'కుసుమ్' పథకం ద్వారా 30 లక్షల మందికి పైగా రైతులకు సౌర నీటిపారుదల సౌకర్యం లభించిందనీ, ఈ సోలార్ పంపులను వాడుతున్న ప్రతి రైతు ఏటా దాదాపు లక్ష రూపాయల వరకు ఆదా చేసుకుంటున్నారనీ శ్రీ మోదీ వివరించారు. భూసేకరణ ఖర్చులను తగ్గించుకుంటూ... జలాశయాలు, చెరువులు, సరస్సుల ఉపరితలంపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసే 'పీఎమ్ సూర్య సరోవర్ యోజన'నూ ఆయన ఉదహరించారు. 'సౌర శక్తిని భారత్ తమ పౌరుల జీవన విధానంలో కీలక భాగంగా మారుస్తోంది' అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

భారత పరిశుద్ధ ఇంధన వ్యవస్థ కేవలం జల, సౌర, పవన, అణుశక్తికే పరిమితం కాలేదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ దశాబ్దం ముగిసే సమయానికి 50 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయడమే కాకుండా, రవాణా రంగంలోనూ గ్రీన్ హైడ్రోజన్‌ను అనుసంధానించేలా 'నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్' కింద దేశం మిషన్ మోడ్‌లో ముందుకుసాగుతోందని ఆయన వివరించారు. 'కేవలం కొన్ని నెలల కిందటే, భారత్ తన తొలి గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించింది' అని ప్రధానమంత్రి గుర్తుచేశారు.

సౌర, పవన విద్యుత్ ను అధికంగా ఉత్పత్తి అయ్యే ప్రాంతాల నుంచి తక్కువ ఉత్పత్తి జరిగే ప్రాంతాలకు సమర్థవంతంగా సరఫరా చేయడం ద్వారా దేశవ్యాప్తంగా ఇళ్లు, వ్యవసాయ క్షేత్రాలు, పరిశ్రమలకు సమానంగా ప్రయోజనం చేకూరాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు ప్రత్యేక ప్రసార లైన్లు, సబ్‌స్టేషన్లతో కూడిన గ్రీన్ ఎనర్జీ కారిడార్ల అభివృద్ధిని ఆయన ప్రస్తావించారు. ఐదు ప్రాంతీయ విద్యుత్ గ్రిడ్‌లను ఒకే గ్రీక్వెన్సీతో అనుసంధానించి, 'ఒకే దేశం - ఒకే విద్యుత్ గ్రిడ్' వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ ప్రసార మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు దేశం ఇప్పుడు తదుపరి దశలోకి అడుగుపెడుతోందని తెలిపారు. " ఇందుకోసం సుమారు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని ఇటీవలే భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

గతంలో చిన్నచిన్న సౌర విద్యుత్ పరికరాల కోసం కూడా పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు దేశీయ తయారీ రంగంలో గణనీయమైన వృద్ధి సాధించడం వల్లే భారత్ హరిత ఇంధన రంగంలో ఈ విజయాలను అందుకోగలిగిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దశాబ్దం క్రితం సుమారు 2 గిగావాట్లుగా ఉన్న సౌర మాడ్యూళ్ల తయారీ సామర్థ్యం నేడు 200 గిగావాట్లకు పైగా పెరిగిందని తెలిపారు. దీనికి తోడు దాదాపు 40 గిగావాట్ల సౌర విద్యుత్ సెల్ తయారీ సామర్థ్యం అందుబాటులోకి వచ్చిందని, ఇతర విడిభాగాల దేశీయ ఉత్పత్తి కూడా విస్తరిస్తోందని వివరించారు. "అంటే, హరిత ఇంధన రంగంలో భారత్ సాధిస్తున్న లక్ష్యాలు మన ఆత్మనిర్భర్ భారత్ అభియాన్, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాల విజయానికి కూడా నిదర్శనం" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

ఇప్పటివరకు సాధించిన విజయాలతో సంతృప్తి చెంది ఆగిపోకుండా, దేశం ఇదే వేగాన్ని కొనసాగించాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. ప్రతి ప్రభుత్వ భవనం, పాఠశాల, కళాశాల, ఆసుపత్రి, వీధి దీపాల వ్యవస్థలను వీలైనంత త్వరగా సౌర విద్యుత్‌తో అనుసంధానించాలని సూచించారు. ఈ లక్ష్య సాధనలో మెరుగైన పనితీరు కనబరిచే రాష్ట్రాలు, స్థానిక సంస్థలను ప్రోత్సహించేందుకు వాటి మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంపొందించాలని ప్రతిపాదించారు. స్థానిక స్థాయిలో విజయవంతమైన నమూనాల నుంచి ఇతర ప్రాంతాలు కూడా పాఠాలు నేర్చుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. "ఈ పనిని మనం వేగవంతంగా చేపట్టాలి" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగంలో సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించేందుకు ప్రత్యేక సూచన చేస్తూ, లక్షలాది సౌర పంపుల పంపిణీతోనే సరిపెట్టుకోకుండా, సాగులో లేని వ్యవసాయ భూములను కూడా సౌర విద్యుత్ ఉత్పత్తికి వినియోగించుకోవాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. వీలైనన్ని గ్రామాల్లో రైతులను ప్రోత్సహించి, ఖాళీగా ఉన్న భూములతో పాటు పొలాల గట్ల వెంట కూడా సౌర ఫలకాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. "మనం సౌర పంపులకే పరిమితం కాకుండా ముందుకు సాగాలి" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు

సౌర విప్లవంలో నూతన శకం కేవలం సౌర విద్యుత్ వినియోగం పెంపుపైనే కాకుండా, వినూత్న ఆవిష్కరణలపైనా ఆధారపడి ఉంటుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. స్టార్టప్‌లు, ఐఐటీలు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు ఈ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ నిరంతరం విద్యుత్ అందించగలిగే సౌర విద్యుత్ నమూనాలను అభివృద్ధి చేయాలని సూచించారు. గృహాల విద్యుత్ అవసరాల్లో అత్యధిక భాగాన్ని తీర్చగలిగేలా, దిగుమతి చేసుకునే గ్యాస్‌పై ఆధారపడటాన్ని తగ్గించేందుకు రూఫ్‌టాప్ సౌర విద్యుత్‌తో వంట చేసే సదుపాయాలు, ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, కార్లకు ఇళ్ల వద్దనే సౌర విద్యుత్ ఛార్జింగ్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు. "దీనివల్ల దేశంలోని మధ్యతరగతి కుటుంబాలు ఏటా వేలాది రూపాయలను ఆదా చేసుకోవచ్చు" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనుబంధ రంగాలకు అవసరమైన ప్రత్యేక స్వచ్ఛ ఇంధన పరిష్కారాల ఆవశ్యకతను ప్రస్తావిస్తూ, పాడి పరిశ్రమలో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక సౌర ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు. "పశువుల మేత తయారీ, పంటల కోత, కోత అనంతర కార్యకలాపాలు.. ఇలా ప్రతి పనికీ సౌర విద్యుత్‌తో పనిచేసే పరికరాలను అభివృద్ధి చేయాలి" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

ఈ లక్ష్యాలను సాధించేందుకు తరువాతి తరం ఆవిష్కరణలు, స్వదేశీ నిల్వ పరికరాలు, కొత్త బ్యాటరీ నిల్వ సామర్థ్యాల అభివృద్ధి అత్యవసరమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ అవసరం భారత యువతకు అపారమైన అవకాశాలను కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు. పరిశోధకులు, పెట్టుబడిదారులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. "భారత్‌లో మీరు అభివృద్ధి చేసే పరిష్కారాలు ప్రపంచంలోని అనేక దేశాలకు ఎంతో ఉపయోగపడతాయి" అని శ్రీ మోదీ అన్నారు.

ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశాల్లో ఒకటైన భారత్‌లో ప్రతి స్వచ్ఛ ఇంధన కార్యక్రమం వేలాది ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. సౌర ఫలకాల తయారీ, హార్డ్‌వేర్ ఉత్పత్తి, ఏర్పాటు, నిర్వహణ, మరమ్మతులు, రవాణా వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తరించడం ద్వారా ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు మరింత పెరుగుతాయని అన్నారు. "వంటగదిలోని పొయ్యి నుంచి రవాణా సాధనాల వరకు అన్నీ సౌర విద్యుత్, హరిత ఇంధనంతో నడిచేలా మారితే, ఒక సరికొత్త పరిశ్రమ ఆవిర్భవిస్తుంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

భారత్‌లో ఉన్న అపారమైన డిమాండ్, విస్తృత స్థాయి, అవకాశాలు, రాజకీయ, విధాన పరమైన స్థిరత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రపంచ పెట్టుబడిదారులకు ప్రధానమంత్రి ఆహ్వానం పలికారు. గత దశాబ్ద కాలంలో పునరుత్పాదక ఇంధన రంగం 15 లక్షల కోట్ల రూపాయల 164 బిలియన్ డాలర్ల) పైగా పెట్టుబడులను ఆకర్షించిందని తెలిపారు. 2024లో జరిగిన రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్ (రీ ఇన్వెస్ట్) సదస్సు తర్వాత కేవలం రెండేళ్లలోనే రూ.6 లక్షల కోట్లకు పైగా (63 బిలియన్ డాలర్లు) పెట్టుబడులు వచ్చాయని వివరించారు. ఈ దశాబ్దం ముగిసే నాటికి ఈ రంగంలో పెట్టుబడి అవకాశాలు రూ.20 లక్షల కోట్లకు (220 బిలియన్ డాలర్లకు) మించునున్నాయని అంచనా వేశారు."కాబట్టి, మీ అందరికీ భారత స్వచ్ఛ ఇంధన రంగంలో అవకాశాల సరికొత్త ఆకాశం ఆవిష్కృతం కానుంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.భారత్ ప్రపంచానికి అందించిన 'ఒకే భూమి - ఒకే కుటుంబం - ఒకే భవిష్యత్తు' సందేశాన్ని ప్రధానమంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తి దేశ స్వచ్ఛ ఇంధన ప్రయాణానికి, అంతర్జాతీయ సౌర కూటమి (ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్) ఏర్పాటుకు పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. అవసరమైన నిధులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం ప్రతి దేశానికి చేరేలా చూడటానికి భారత్ కట్టుబడి ఉందని తెలిపారు. "ఈ నేపథ్యంలో ఆఫ్రికా కోసం 200 మిలియన్ డాలర్లతో ఆఫ్రికా సోలార్ ఫెసిలిటీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చాం" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.ప్రపంచ వాతావరణ లక్ష్యాల సాధనకు రాబోయే దశాబ్దం అత్యంత కీలకమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ మార్పులో ప్రతి దేశాన్ని, ప్రతి ప్రాంతాన్ని భాగస్వాములను చేయడం ద్వారా భవిష్యత్తును సురక్షితం చేయడంలో ఈ సదస్సులో పాల్గొన్నవారు కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తూ ప్రధానమంత్రి ప్రసంగం ముగించారు.

శారీరక దృఢత్వం, మానసిక స్థిరత్వానికి క్రీడలే ప్రాణాధారం


యువత వ్యసనాలకు దూరంగా ఉండి మైదానాల వైపు అడుగులేయాలి
క్రీడల విజయవంతానికి వ్యాయామ ఉపాధ్యాయుల శ్రమే కారణం
బషీరాబాద్ జడ్పీ పాఠశాల అభివృద్ధికి దాత దయానంద్ రెడ్డి రూ.5 లక్షల విరాళం
వెయ్యి మంది క్రీడాకారులకు మూడు రోజుల పాటు అన్నదానం
కమ్మర్‌పల్లి మండల క్రీడోత్సవాల నిర్వహణపై ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అభినందనలు



నిజామాబాద్, నవంబర్ 3:నేటి ఆధునిక కాలంలో చిన్నారులు, యువత స్మార్ట్‌ఫోన్లకు, చెడు అలవాట్లకు బానిసలు కాకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఎదిగేందుకు రోజుకు కనీసం ఒక గంట పాటు క్రీడా మైదానాలకు పంపాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల పరిధిలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన 70వ అండర్-14, అండర్-17 బాలబాలికల మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలను సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి అభినందించారు. మార్చ్‌ఫాస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలకు జ్ఞాపికలు అందజేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చదువు, విజ్ఞానం ఎంత కీల

సోమాలియా తీరానికి సమీపంలో సముద్రపు దొంగలు హైజాక్ చేసిన చేపలు పట్టే పడవ 'అజిని'ని రక్షించిన భారతీయ నౌకాదళం



న్యూ ఢిల్లీ, నవంబర్ 3:చేపలు పట్టేందుకు సముద్రంలోకి వెళ్లిన 'అజిని' నౌకను సముద్రపు దొంగల పిడికిట్లో నుంచి భారతీయ నౌకాదళం రక్షించింది. సత్వరం స్పందించి 48 గంటల కన్నా ఎక్కువ సమయం పాటు సమన్వయ పూర్వక దాడిని కొనసాగించి మరీ విజయాన్ని సాధించింది. నౌకలో ఉన్న 20 మంది సిబ్బందిని గాయాల పాలవకుండాను, ప్రాణహాని కలగకుండాను కాపాడారు.

అజినిని సోమాలియాకు ఈశాన్య దిక్కు కోస్తా తీరంలో సాయుధ సముద్ర దొంగల ముఠా కిందటి నెల మొదట్లో బలవంతంగా అధీనంలోకి తీసుకున్నారని తెలియవచ్చింది. ఈ అపహరణ ఉదంతం నౌకావాణిజ్య సంబంధిత సురక్షకు ఓ పెద్ద బెదరింపుగా పరిణమించింది.. ఆ ప్రాంతంలో నౌకావాణిజ్య కార్యకలాపాలకు వ్యతిరేకంగా మరిన్ని దాడులను మొదలు పెట్టడానికి ఈ నౌకను ఓ స్థావరంగా మార్చుకొనే అస్కారం ఉందని భావించారు.

ఈ తరుణంలో భారతీయ నౌకాదళం రంగంలోకి దిగి, ఓ యుద్ధనౌకను మోహరించింది. ఆ యుద్ధనౌకకు, నముద్ర నిఘాలో పాలుపంచుకొనే ఓ విమానం తరఫు నుంచి కూడా సహకారాన్ని అందించారు. ఈ రెండూ సన్నిహిత సమన్వయాన్ని ఏర్పరుచుకొని నౌక స్థితిని, దాని కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. నౌక కదలికల్ని పసిగడుతూ, అది పలాయనం చిత్తగించకుండా దశల వారీ దీటైన స్పందనాత్మక చర్యలను కూడా చేపట్టారు.

భారతీయ వైమానిక దళం (ఐఏఎఫ్)కు చెందిన సి-17 విమానంతో కచ్చితమైన ఎయిర్‌డ్రాప్‌లను చేపట్టి, మెరైన్ కమాండోల బృందం సేవలను కూడా తీసుకున్నారు.

శీఘ్రమైన, సమన్వయపూర్వకమైన పోరాట తంత్రాన్ని అమలుపరిచి, భారతీయ నౌకాదళం నౌకపై పట్టును బిగించింది. సముద్రపు దొంగల ముప్పును తిప్పికొట్టి, నౌకలో ఉన్న 20 మందిని సురక్షితంగా కాపాడారు.

ఈ విజయవంతమైన దాడి భారతీయ నౌకాదళం ఉన్నత నిర్వహణ సన్నద్ధతను, వివిధ దళాల మధ్య సమన్వయాన్ని చాటుతూ, సంక్లిష్ట నౌకా వాణిజ్య సంబంధిత భద్రత కార్యకలాపాలలో ఆశించిన ఫలితాన్ని రాబట్టగలిగిన సత్తాకు ఒక నిదర్శనంగా నిలిచింది. ఇది హిందూ మహాసముద్ర ప్రాంతంలో తొలుత స్పందించే, పలు పక్షాలు మొగ్గు చూపే భద్రతాపరమైన భాగస్వామ్య దేశంగా భారత్ చాటుకొంటున్న అచంచల నిబద్ధతను కూడా మరో సారి స్పష్టం చేసింది.

నావికులకు అభయం ఇవ్వడంలో, కీలక నౌకావాణిజ్య మార్గాలను రక్షించడంలో, హిందూ మహాసముద్ర ప్రాంతంలో సురక్షిత, సుస్థిర నౌకావాణిజ్య సంబంధిత వాతావరణాన్ని ఏర్పరచడంలో భారతీయ నౌకాదళం తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించడానికి కట్టుబడి ఉంది.

మస్కట్‌లో చిక్కుకున్న మహిళను స్వదేశానికి రప్పించిన కేటీఆర్

నెల రోజుల్లోనే తల్లిని ఇంటికి తీసుకొస్తానని కుమారుడికి హామీ..
నిలబెట్టుకున్న వర్కింగ్ ప్రెసిడెంట్
కొడంగల్ మహిళకు అండగా నిలిచిన కేటీఆర్..
తెలంగాణ భవన్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపిన లక్ష్మి



కరీంనగర్, నవంబర్ 3:: ఉపాధి కల్పిస్తామని నమ్మించి మోసం చేయడంతో మస్కట్‌లో చిక్కుకుపోయిన కొడంగల్ నియోజకవర్గానికి చెందిన తుప్పుడు లక్ష్మిని సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహకరించారు. నెల రోజుల్లోనే తల్లిని ఇంటికి తీసుకొస్తానని ఆమె కుమారుడు రాజుకు ఇచ్చిన హామీ మేరకు అవసరమైన చర్యలు చేపట్టారు. దీంతో లక్ష్మి సురక్షితంగా భారత్‌కు తిరిగి చేరుకున్నారు. తల్లిని స్వదేశానికి రప్పించినందుకు ఆ కుటుంబ సభ్యులు కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని గోకఫసల్వాద గ్రామానికి చెందిన తుప్పుడు లక్ష్మి, ఆమె భర్త వెంకటప్ప ఉపాధి కోసం ఫిబ్రవరి 27న మస్కట్‌కు వెళ్లారు. అయితే అక్కడికి చేరుకున్న తర్వాత ఏజెంట్ చెప్పిన పనికి భిన్నమైన పని అప్పగించడంతో లక్ష్మి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అంతేకాకుండా యజమాని (కఫీల్) ఆమె పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుని స్వదేశానికి పంపించేందుకు నిరాకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తనను విదేశాలకు పంపించిన ఏజెంట్ కూడా ఫోన్‌కు స్పందించకుండా, తిరిగి భారత్‌కు పంపించేందుకు రూ. 2 లక్షలు డిమాండ్ చేసినట్లు లక్ష్మి కుటుంబ సభ్యులకు తెలిపింది. ఈ క్రమంలో ఆమె వైఫై, సిమ్ కార్డు సేవలు కూడా నిలిచిపోవడంతో కుటుంబ సభ్యులతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. చివరకు పక్కింటివారి ఇంటర్నెట్ సహాయంతో కుమారుడు రాజును సంప్రదించి అక్కడ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు.

తల్లి పడుతున్న కష్టాలను తెలుసుకున్న కుమారుడు రాజు సెప్టెంబర్ 29న కేటీఆర్‌ను కలిసి కుటుంబ పరిస్థితిని వివరించారు. స్పందించిన కేటీఆర్ నెల రోజుల్లోనే పాస్‌పోర్టు సమస్యను పరిష్కరించి, తల్లిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొస్తానని రాజుకు భరోసా ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు లేఖ రాయడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకున్నారు. దీంతో లక్ష్మి స్వదేశానికి చేరుకున్నారు.

కుటుంబ సభ్యులను కలుసుకున్న అనంతరం లక్ష్మి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉన్న సమయంలో అండగా నిలిచి, కుమారుడికి ఇచ్చిన మాట ప్రకారం తనను స్వదేశానికి రప్పించేందుకు సహకరించిన కేటీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని భావోద్వేగంతో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా తుప్పుడు లక్ష్మి మాట్లాడుతూ.. "నా కొడుకుకు కేటీఆర్ గారు నెల రోజుల్లోనే నిన్ను ఇంటికి తీసుకొస్తానని మాట ఇచ్చారు. అన్న ఇచ్చిన మాట ప్రకారం నన్ను సురక్షితంగా ఇంటికి తీసుకొచ్చారు. నేను, నా కుటుంబం ఎదుర్కొంటున్న కష్టకాలంలో కేటీఆర్ అన్న మాకు అండగా నిలిచారు. ఆయన చేసిన సహాయాన్ని జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. కేటీఆర్ అన్నకు నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని తెలిపారు.

ఏడు విమానాశ్రయాలలో అంతర్జాతీయ ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని పరీక్షలు మొదలుపెట్టిన 'డిజి యాత్ర'

న్యూ ఢిల్లీ, నవంబర్ 3:భారతదేశంలో ఏడు విమానాశ్రయాలలో అంతర్జాతీయ ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని 'డిజి యాత్ర' పరీక్షలను మొదలు పెట్టారు. ఇది దేశంలో విమాన యాన రంగంలో డిజిటల్ సాంకేతికతను అనుసరించే దిశలో వేసిన మరొక అడుగు అని చెప్పాలి. ఈ పరీక్షలను 2026 నవంబర్ మొదలు డిసెంబర్ వరకు చేపడతారు. వీటిలో భాగంగా, ఈ-పాస్‌పోర్టులు కలిగివున్న భారతీయ పౌరులు ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలు నిర్వహించే కొన్ని అంతర్జాతీయ ఫ్లైట్లలో ప్రయాణించేటపుడు, ఆయా విమానాశ్రయాలలో నిర్ధారించిన కేంద్రాల వద్ద డిజి యాత్ర సదుపాయాన్ని వినియోగించుకో వచ్చు.

ఈ ప్రయోగాత్మక పథకాన్ని ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, కోచి, ముంబయి, చెన్నయి, అమృత్‌సర్ విమానాశ్రయాలలో నిర్వహిస్తున్నారు. అర్హులైన ప్రయాణికులు టర్మినల్ ప్రవేశ ద్వారాలు, సెక్యూరిటీ హోల్డ్ ఏరియా (ఎస్‌హెచ్ఏ)లు, బోర్డింగ్ గేట్ల వద్ద, సంబంధిత మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్న చోట్లల్లా, ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చు. ప్రయోగాత్మకంగా చేపడుతున్న సమయంలో అందే అభిప్రాయాలు 2027లో విస్తృత స్థాయిలో దీనిని అమలు చేసేందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయడంలో ఉపయోగ పడతాయని ఆశిస్తున్నారు.ఈ సదుపాయాన్ని ఉపయోగిం చుకోవడానికి, అర్హత కలిగిన భారతీయ పౌరులు 'డిజి యాత్ర' మొబైల్ అప్లికేషన్ (యాప్) ద్వారా ఈ-పాస్‌పోర్ట్ ఆధారిత వెరిఫైయ బుల్ క్రెడెన్షియల్ (వీసీ)ని రూపొంది ంచుకోవ లసి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఈ-పా స్‌పోర్టు 'మెషీన్ రీడబుల్ జోన్' (ఎమ్ఆర్‌జడ్)ను స్కాన్ చేయడం, సంబంధిత స్మార్ట్‌ఫోన్ లోని 'నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్' (ఎన్ఎఫ్‌సీ) ఫీచరును ఉపయోగించి అందులో అమర్చి ఉన్న చిప్‌ను చదవడం, సెల్ఫీ తీసుకోవడం, వివరాలను సరైన వని ధ్రువీకరించడం వంటి అంశాలు ఇమిడి ఉంటాయి. ఈ గుర్తింపు పత్రం ప్రయాణికుల డివైస్‌లో ఉండే 'డిజి యాత్ర' వ్యాలెట్‌లో నిల్వ అయి ఉంటుంది. దీనిని విమానాశ్రయంలో పరీక్షలకు ఉద్దేశించిన కేంద్రాల వద్ద ఉపయోగి ంచవచ్చు.ఈ సదుపాయం ప్రస్తుత ప్రయాణ ప్రక్రియలకు ఒక పూరకంగా ఉంటుంది. అంతే తప్ప, ఆ ప్రక్రియలను తోసిరాజ నడం ఈ సదుపాయాన్ని ప్రవేశపెట్టడంలోని ఉద్దేశం కానే కాదు. ప్రయాణికులు తమ ప్రయాణ దస్తావేజులను తమతో పాటు అట్టిపెట్టుకోవాలి. విమాన సంస్థ తాలూకు దస్తావేజుల తనిఖీ, ఇమిగ్రేషన్ ప్రక్రియలు, ఇతర వర్తించే ప్రయాణ లాంఛనాలను ప్రయాణికులు తప్పనిసరిగా నెరవేర్చవలసి ఉంటుంది.

భారతదేశ విమానయాన నెట్‌వర్కులో 'డిజి యాత్ర'ను ఉపయోగించే ధోరణి నిరంతరాయంగా విస్తరిస్తోంది. ఈ సేవను 26.5 మిలియన్ కన్నా ఎక్కువ మంది వినియోగదారులు పొందుతున్నారు. ఇది దేశీయ ఎయిర్‌లైన్స్ ఉపయోగి ంచుకుంటున్న 39 దేశీయ విమానాశ్రయాలలో 110 మిలియన్‌కు మించిన ప్రయాణాలకు మార్గాన్ని సుగమం చేసింది. 2027 కల్లా మరో 25 దేశీయ ఎయిర్‌పోర్టులను దీని పరిధిలోకి తీసుకురా వాలనుకుంటున్నారు.భారత్ ప్రభుత్వ 'డిజిటల్ ఇండియా', 'ఈజ్ ఆఫ్ ఫ్లయింగ్' దృష్టికోణాలకు అనుగుణంగా విమానాశ్రయాల కార్య కలాపా లను మెరుగుపరచడానికి, ఎలా ంటి ఇబ్బందులు ఎదురవకుండా విమాన ప్రయాణానికి మార్గాన్ని సుగమం చేయడానికి సాంకేతిక తను ఉపయోగించుకొనేందుకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది.

భారత బయోఫార్మా అంకురసంస్థల రంగాన్ని బలోపేతం చేసే, బయోఎకానమీ వృద్ధిని పెంచే రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించిన వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూ ఢిల్లీ, నవంబర్ 3:న్యూఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో "ఇండియాన్ బయోఎకానమీ ఆపర్చ్యూనిటీ: రోల్ ఆఫ్ స్టార్టప్స్ ఇన్ డ్రైవింగ్ ఇన్నోవేషన్ అండ్ గ్రోత్" అంశంపై జరిగిన ఉన్నత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని నీతి ఆయోగ్, నీతి ఫ్రాంటియర్ టెక్ హబ్ సహకారంతో పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) నిర్వహించింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో విధాన రూపకంలు, పారిశ్రామికవేత్తలు, బయోఫార్మా అంకురసంస్థల ప్రతినిధులు భారతదేశ బయోఎకానమీ వృద్ధిని వేగవంతం చేసే చర్యలపై చర్చించారు. బయోఎకానమీ రంగంలో అగ్రగామిగా భారత్‌ను నిలబెట్టేలా దేశీయ శాస్త్రీయ సామర్థ్యాలను, ఔత్సాహిక పారిశ్రామిక ప్రతిభను ఉపయోగించుకోవాలని తన ప్రసంగంలో శ్రీ పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. వేగవంతమైన అనుమతులు, అందుబాటులో ఆర్థిక వనరులు, ఉమ్మడి మౌలిక వసతులు, బలమైన పరిశ్రమ - విద్యాసంస్థ -ప్రభుత్వ సహకారానికి ఉన్న ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో సూచించిన సిఫార సులపై నిర్దేశిత కాలపరిమితిలో తగిన చర్యలు చేపట్టాలన్నారు.

వ్యవస్థీకృత నియంత్రణలు, వేగవంతమైన ఆమోదాలు, ప్రతిపాదిత రెగ్యులేటరీ శాండ్‌బాక్స్, సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు, అంతర్జాతీయ నియంత్రణలతో సమన్వయం, సరళీకృత పేటెంట్ దరఖాస్తు ప్రక్రియల ద్వారా బయోఫార్మా అకుంరసంస్థల వ్యవస్థను బలోపేతం చేయడంపై చర్చలో దృష్టి సారించారు.

వ్యయాన్ని తగ్గించడానికి, అంకుర సంస్థలు తమ ఆవిష్కరణలను అభివృద్ధి చేయడానికి కేంద్ర బడ్జెట్ 2026-27లో ప్రకటించిన బయోఫార్మా శక్తి ప్రాధాన్యం గురించి, ప్రయోగశాలలు, టెస్టింగ్ కేంద్రాలు, క్లినికల్ ట్రయల్ వనతులతో పాటు ఉమ్మడి మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం గురించి ఈ సమావేశంలో చర్చించారు.

అంతర్జాతీయంగా పోటీనిచ్చే బయోఎకానమిని నిర్మించడంలో అంకుర సంస్థలు, పరిశ్రమ, విద్యాసంస్థలు, ప్రభుత్వం మధ్య సహకారానికి ఉన్న ప్రాధాన్యం గురించి నీతి ఆయోగ్ విశిష్ట నిపుణులు డేబ్జానీ ఘోష్ వివరించారు. పరిశోధన సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన, శాస్త్రీయ ఆవిష్కరణలను వాణిజ్యపరంగా లాభదాయకమైన ఉత్పత్తులుగా మార్చాల్సిన నీతి ఆయోగ్ సభ్యులు ప్రొఫెసర్ గోబర్ధన్ దాస్ వివరించారు.

దేశీయంగా లైఫ్ సెన్సెస్ మ్యానుఫాక్చరింగ్‌ను బలోపేతం చేయడం, ప్రయోగశాల పరికరాలకు, రసాయనాలకు కస్టమ్స్ అనుమతులను వేగవంతం చేయడం, ప్రభుత్వ పథకాలు, నియంత్రణల మద్దతును సులభంగా పొందడానికి వీలు కల్పించడం తదితర చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. సమగ్ర విధానపరమైన చర్యలను సులభతరం చేయడానికి, రంగాల వారీగా ఎదురయ్యే సవాళ్లను వేగంగా పరిష్కరించడానికి మంత్రిత్వ శాఖల మధ్య మరింత బలమైన సమన్వయం అవసరమని ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నవారు స్పష్టం చేశారు.

నిర్మల్‌లో బీజేపీ మహాపాదయాత్ర!

ప్రారంభించిన సునీల్ బాన్సల్, బండి సంజయ్
రెండు కిలోమీటర్ల మేర కొనసాగిన పాదయాత్ర
పెద్ద సంఖ్యలో పాల్గొన్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

ఆదిలాబాద్, నవంబర్ 3: రాజ్యాంగంపై విపక్షాలు కుట్రలు చేస్తున్నాయంటూ బీజేపీ చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచా రాన్ని నిరసిస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం మహాపాదయాత్ర నిర్వహిం చారు. బీజేపీ ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమాన్ని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, ప్రధాన కార్యదర్శి సునీల్ బాన్సల్, కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచం దర్‌రావు, ఎంపీలు గెడం నాగేష్, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో నిర్మల్ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సుమారు రెండు కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బియ్యం దుకాణాలు, సూపర్ మార్కెట్లలో ఆకస్మిక తనిఖీలు

తూనికలు, కొలతల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు..
వినియోగదారులకు మోసం జరగకుండా అధికారుల సూచనలు

ఆదిలాబాద్, నవంబర్ 3: వినియోగదారులకు నిత్యావసర సరుకులను సరైన తూకంతో విక్రయించాలని, తూనికలు, కొలతల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడవద్దని మంచిర్యాల జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి అజీజ్ పాషా వ్యాపారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం లక్షెట్టిపేట పట్టణంలోని పలు బియ్యం దుకాణాలు, సూపర్ మార్కెట్లలో ఆయన ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ నందర్భంగా బియ్యం విక్రయ ధరలు, బస్తాల బరువులను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీఎస్టీతో సహా బియ్యం విక్రయాలు జరపాలని, బస్తాల బరువులో నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని దుకాణ యజమానులకు సూచించారు.

రైతుల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తాం ? ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి.



సంగారెడ్డి నవంబరు 03(నేటి నిజం ప్రతినిధి) రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు.

శంకరంపేట మండల కేంద్రంలో డీసీసీబీ ఆధ్వర్యంలో, కమలాపూర్ సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెదక్ జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2,461, సాధారణ రకం ధాన్యానికి రూ. 2,441 చొప్పున చెల్లించనున్నట్లు వెల్లడించారు.

రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో పూర్తి పారదర్శకత పాటించాలని, రైతులకు సకాలంలో మద్దతు ధర అందేలా సంబంధిత అధికారులు, సొసైటీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, డీసీసీబీ అధికారులు, సొసైటీ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు

పరిహారం చెల్లించాకే కెనాల్ పనులు చేపట్టాలి!

ఓపెన్ కెనాల్ పనులను అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు
భూనిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్
పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ



మహబూబ్‌నగర్, నవంబర్ 3:నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం దంతాపల్లి శివారులో మక్తల్?నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ఓపెన్ కెనాల్ పనులను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం అడ్డుకున్నారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించిన కొద్దిసేపటికే అక్కడికి చేరుకున్న నాయకులు వాటిని నిలిపివేశారు.

ఈ నందర్భంగా టీఆర్ఎన్వీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కోరం శివరాజు రెడ్డి, నాయకులు వడ్ల మోనప్ప, ఇబాదూర్ రెహమాన్, తరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎత్తిపోతల పథకం పనుల్లో భూములు కోల్పోయిన పలువురు రైతులకు ఇంకా పూర్తి పరిహారం అందలేదని తెలిపారు. భూములకు పరిహారంతో పాటు పొలాల్లోని బోరుబావులు, చెట్లు, గుడిసెలు తదితర వాటికి కూడా పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. వీటన్నింటికీ పూర్తిస్థాయిలో పరిహారం అందించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పనులు పూర్తయిన తర్వాత భూనిర్వాసిత రైతులను పట్టించుకునే వారు ఉండరని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు పనులు కొనసాగనివ్వబోమని స్పష్టం చేశారు.

విషయం తెలుసుకున్న తహసీల్దార్ అశోక్‌కుమార్ అక్కడికి చేరుకుని నాయకులు, రైతులతో మాట్లాడారు. భూనిర్వాసిత రైతులకు చెట్లు, బోరుబావులు, కంచెలు తదితర వాటికి సంబంధించిన పరిహారం అందేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అభిలాష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భారత సాయుధ తిరుగుబాటు పితామహుడు ఫడ్కే

నవంబర్ 4...వాసుదేవ బల్వంత ఫడ్కే జయంతి



వాసుదేవ్ బల్వంత్ ఫడ్కే.. దేశంలో చాలా మందికి తెలియని, విని ఉండని పేరు. ఆ త్యాగ ధనుని గురించి చరిత్ర పుస్తకాలలో కూడా ఎక్కడా కనిపించదు. భారత దేశంలో సాయుధ తిరుగుబాటుకు బీజం వేసిన వ్యక్తి ఆయనే అని, తొలి దేశద్రోహం కేసు నమోదు కాబడింది ఆ ఉద్యమ కారుని మీదే అన్న విషయం తెలిస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ఆంగ్లేయుల దురాగతాలను ఎదిరించి, శ్వేత జాతీయులపై తుపాకీ ఎక్కుబెట్టిన వీరుడు. బల ప్రయోగం ద్వారానే ఆంగ్లేయులను దేశం నుండి తరిమి వేయాలని తీర్మానించి, అమలులో ప్రాణాలు అర్పించిన వీర యోధు డు. శక్తివంత మైన బ్రిటిష్ సామ్రా జ్యాన్ని ఒంటిచేత్తో ఎదిరించి, సాయుధ తిరుగు బాటును రేకెత్తిం చి, భారత్‌లో బ్రిటిష్ అధికారాన్ని నాశనం చేసి హిందూ రాజ్యాన్ని పునఃస్థాపిస్తా నని ప్రతిజ్ఞ చేసిన మేరు నగ ధీరుడు. 1879 అక్టోబర్ 22న ఆంగ్ల ప్రభుత్వం మొదటి రాజద్రోహ నేరం మోపబడింది ఈ వీరుడి పైనే కావడం గమనార్హం.

వాసుదేవ బల్వంత ఫడ్కే (4 నవం బర్ 1845 ? 17 ఫిబ్రవరి 1883) బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన భారతీయ స్వాతంత్ర్య సమర యోధుడు. ఫడ్కే 1845 నవంబర్ 4న ప్రస్తుతం మహారాష్ట్ర లోని రాయ్‌గఢ్ జిల్లాలో ఉన్న పన్వెల్ తాలూకాలోని షిర్ధోన్ గ్రామంలో మరాఠీ చిత్పవన్ బ్రాహ్మణ రైతుకుటుంబంలో కుటుంబంలో జన్మించిన వాసుదేవ్, ప్రాథమిక విద్య తన గ్రామమైన షిర్ధోన్ లోనే పూర్తి చేశాడు. హైస్కూల్ విద్యకు పూనాకు వెళ్ళగా ఆంగ్లేయులకు వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడు తున్నాడని 9 వ తరగతి లో బడి నుండి బయటకు పంపారు. పుణే నగరం చేరుకుని మిలటరీ అక్కౌంట్స్ డిపార్టుమెంటులో గుమాస్తాగా 15 సంవత్సరాల పాటు పని చేశాడు. సొంత గడ్డపై వ్యవసాయం చేస్తూ, రైతులపై అధిక పన్నులు విధిస్తున్న ఆంగ్లేయు లకు ఎదురు తిరిగాడు. వలస పాలన నుండి భారత స్వాతంత్ర్యం పొందే లక్ష్యంతో కోలి, బిల్ల, దంగర్ ఆదిగా సుమారు 300 మంది ఆదివాసీ యువకుల సహాయంతో 'రామోషి' అనే విప్లవ తిరుగుబాటు బృందాన్ని రూపొందించి, వారికి యుద్ధ విద్యలపై శిక్షణ నిర్వహిం చాడు.

వాసుదేవ్ మొదట ప్రభుత్వ ఖజా నాలపై దాడి చేయడం మొదలు పెట్టాడు. అలా కొల్లగొట్టిన డబ్బును రైతులకు, ఆదివాసీలకు పంచే వాడు. ఆయుధాలు సమకూర్చు కొనేవాడు. బ్రిటీష్ సైనికులపై హఠాత్తుగా జరిపిన గెరిల్లా దాడుల వల్ల ఏకంగా పుణె నగరం పైనే ఫడ్కే పట్టు సాధించి, పూనాలో బలవంతు డైన తిరుగుబాటు నాయకుడైనాడు. దానితో ఆంగ్లే యులు పెద్దసైన్యం పంపారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏకకాలంలో అనేక దాడులను నిర్వహించడానికి వాసుదేవ బల్వంత ఫడ్కే ప్రణాళికలు రచించినా పరిమిత విజయాన్నే అందించాయి. ఒకసారి ఘనూరు గ్రామంలో సైన్యంతో నేరుగా తలప డ్డాడు. వాసుదేవ్ ను పట్టుకుంటే బ్రిటిష్ ప్రభుత్వం బహుమానం ప్రకటిస్తే... బొంబాయి గవర్నర్‌ను పట్టుకున్నందుకు ఫడ్కే ఎదురు బహుమానం ప్రకటించాడు. ప్రతి యూరోపియన్‌ని చంపినందుకు బహుమతిని ప్రకటించాడు.

కొన్ని రోజులు పూనాను వదిలి హైదరాబాద్‌కు వచ్చాడు. అప్పుడు హైదరాబాద్ పై రోహిల్లాల తిరుగు బాటు జరుగుతున్నది.

వాసుదేవ్ వారితో జత కట్టి నిజాంపై తిరుగుబాటు చేసాడు. రోహిల్లా లతో పాటు అరబ్బులు కూడా ఆయనతో చేతులు కలపారు. కాని ఆంగ్లేయుల గూఢ చారులు వాసుదేవ్ ఆచూకీ తెలుసు కున్నారు.

బ్రిటిష్ మేజర్ హెన్రీ విలియం డేనియల్, హైదరాబాద్ నిజాం పోలీసు కమిషనర్ అబ్దుల్ హక్ తదతరులు అవిశ్రాంతంగా ఆయన అచూకి కోసం వెతికారు. 20 జూలై 1879న పండార్‌పూర్ వెళ్తున్న ప్పుడు కలడ్గి జిల్లాలో జరిగిన తీవ్రమైన పోరాటంలో వాసుదేవ్ ను ఒక దేవాలయంలో బంధించారు.

ఫడ్కేని విచారణ నిమిత్తం పూణేకు తీసుకెళ్లారు. సర్వజనిక్ కాకా అని పిలువబడే గణేష్ వాసుదేవ్ జోషి ఆయన కేసును వాదించాడు. ఫడ్కేకి జీవిత ఖైదు విధించారు. ఆయన భారత్‌లో ఉంటే ప్రమాద కరమని గ్రహించి, జీవితాంతం ఏడెన్‌లోని జైలుకు తరలించారు. అతనికి సంకెళ్లు వేసి ఏకాంత నిర్బంధంలో ఉంచారు.

అక్కడ 13 ఫిబ్రవరి 1883న జైలు నుండి అతను తప్పించుకున్నా మళ్ళీ వెంటనే తిరిగి స్వాధీనం చేసు కున్నారు బ్రిటీష్ పోలీసులు. అప్పటి నుంచి నిరాహార దీక్ష చేస్తూ 17 ఫిబ్రవరి 1883న వాసుదేవ బల్వంత ఫడ్కే తుది శ్వాస విడిచాడు.

ఫడ్కే భారత సాయుధ తిరుగు బాటు పితామహుడిగా పేరు పొందాడు. స్వతంత్ర ఉద్యమంలో సహ సభ్యులకు స్ఫూర్తిని అందించాడు. ఈ సమయంలో ఆయన కార్య కలాపాలను బంకిం చంద్ర చటో పాధ్యాయ్ రచించిన దేశభక్తి నవల ఆనంద్ మఠ్ లో పొందు పరిచారు.

కానీ అప్పటి బ్రిటీష్ వలస ప్రభుత్వం దీన్ని ఆమోదించ లేదు. అందుకని ఈ అంశాలు తొలగించి పుస్తకాన్ని కుదించి ముద్రించా ల్సి వచ్చింది. 1984 లో, భారతీయ పోస్టల్ సర్వీస్ ఫడ్కే గౌరవార్థం 50 పైసల స్టాంపును విడుదల చేసింది. ఆయన గౌరవార్థం దక్షిణ ముంబై లోని మెట్రో సినిమా సమీపంలో ఒక చౌక్ పేరు పెట్టారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

రేస్ కోర్స్ స్థలాన్ని ఐఏఎఫ్‌కే ఇవ్వండి.. రాజ్‌నాథ్‌కు లేఖ రాసిన ఏపీ సింగ్

న్యూఢిల్లీ: ఢిల్లీలోని రేస్ కోర్సు ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ భూమి(ఖీజీఱవ అనీబీతీబవ ఒజీనిట)పై వివాదం నెలకొన్నది. ఆ భూమిని ఐఏఎఫ్ ఆధీనంలోనే ఉంచాలని మాజీ ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్.. తన రిటైర్మెంట్‌కు కొన్ని రోజుల ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాసినట్లు తెలుస్తోంది. అక్టోబర్ 26వ తేదీన ఆయన ఆ లేఖ రాశారు. 40 ఎకరాల స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థలాన్ని వైమానిక దళం ఆధీనంలోనే ఉంచాలని ఏపీ సింగ్ రక్షణ మంత్రిని కోరారు. అక్టోబర్ 29వ తేదీన రాజ్‌నాథ్ సింగ్‌తో జరిగిన వ్యక్తిగత మీటింగ్‌లోనూ ఈ అంశాన్ని చర్చించినట్లు తెలుస్తోంది. ఐఏఎఫ్ స్టేషన్‌లో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ సీల్ చేయడంతో ఈ వివాదంపై రక్షణమంత్రికి ఏపీ సింగ్ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. గృహ నిర్మాణ శాఖ ఆ స్థలాన్ని సీజ్ చేయడం వల్ల రక్షణ రంగంలో ఆందోళన మొదలైంది. సీజ్ చేసిన స్థలంలో గోల్ఫ్ కోర్స్, స్విమ్మింగ్ పూల్, ఇతర ఎమినిటీస్ ఉన్నాయి.అయితే ఈ వివాదం నేపథ్యంలోనే ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ఫేర్‌వెల్‌ను రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఐఏఎఫ్ కానీ, రక్షణ శాఖ నుంచి కానీ అధికారిక ప్రకటన లేదు.ఎయిర్ స్టేషన్ నిర్వహణలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ చాలా ముఖ్యమైందని, ఈ స్థలం ఐఏఎఫ్ వద్దే ఉండాలని, దీని కోసం మరోసారి జాయింట్ సర్వే నిర్వహించాలని ఏపీ సింగ్ తన లేఖలో మంత్రి రాజ్‌నాథ్‌ను కోరారు. రక్షణ శాఖకు వైమానిక దళం తమ అభ్యంతరాలను వ్యక్తం చేసింది. 40 ఎకరాల స్థలం సీలింగ్ ప్రక్రియను రద్దు చేయాలని కోరారు. రేస్ కోర్సు ఎయిర్ స్టేషన్‌కు గత చరిత్ర ఎంతో ఉందని, మూడు సెగ్మెంట్లలో భూమి ఉందని, అయితే అవన్నీ సహజంగా పనిచేయాలని ఏపీ సింగ్ తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఉన్న అత్యంత ఖరీదైన భూమిలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్నది. డిఫెన్స్ గోల్ఫ్ కోర్సులు, స్పోర్ట్స్ ఫెసిలిటీల్లో ఉన్న ప్లాట్ల గురించి కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖకు చెందిన ఎల్ అండ్ డీవో ఇటీవల ఆరా తీసింది. ఎయిర్ ఫోర్స్ గోల్ఫ్ కోర్సును తమకు అప్పగించాలని గృహ, పట్టణ వ్యవహారాల శాఖ కోరింది. దీంతో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఖాళీ చేయాలని కోరుతూ ఎల్ అండ్ డీవో శాఖ నోటీసులు జారీ చేసింది.ఇటీవల ఢిల్లీ రేస్ క్లబ్, జైపూర్ పోలో గ్రౌండ్‌ను కూడా ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకున్న విషయం తెలిసిందే.

తెలంగాణలో భయానకమైన పరిస్థితులు ఉన్నాయి : ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



హైదరాబాద్, నవంబర్ 3: తెలంగాణలో భయానకమైన పరిస్థితులు ఉన్నాయి. నీళ్లపై ఆధారపడిన పరిశ్రమలు మూతపడే పరిస్థితి వచ్చింది. ప్రకృతి వైపరిత్యాలను ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం అయిందని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ ఆరోపించారు.

మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కరువును ఎదుర్కోవడంలో ఏపీ ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించింది. 750 టీఎంసీల గోదావరి నీళ్లు, 50 టీఎంసీల కృష్ణా నీళ్లు ఏపీకి తీసుకెళ్లారన్నారు. అమిత్ షా,రేవంత్ రెడ్డి ఇద్దరూ పోటీ పడి విమర్శలు చేసుకున్నారు. ఢిల్లీలో రేవంత్ రెడ్డి ధర్నా,హైదరాబాద్‌కు వచ్చి అమిత్ షా పాదయాత్రతో తెలంగాణకు ఏం ఒరిగిందని ప్రశ్నించారు.కాంగ్రెస్,బీజేపీ రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయి అని మండిపడ్డారు. అమిత్ షా హైదరాబాద్ కు వచ్చి గుడికి వెళ్లారు. పాదయాత్ర చేశారు. సభలో మాట్లాడి ఢిల్లీకి వెళ్లిపోయారు. తెలంగాణలో కరువుపై అమిత్ షా ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. తెలంగాణ నుంచి ఉన్న కేంద్ర మంత్రులు, ఎంపీలు ఎందుకు కరువుపై అమిత్ షా కు చెప్పలేదన్నారు. దేశాన్ని మోదీ, అమిత్ షా ఇద్దరు పాలిస్తున్నారు. దేశంలో డి ఫాక్టో పీఎం అమిత్ షా అని పేర్కొన్నారు.

కరువు ఫైల్ కేంద్ర హోం శాఖా, వ్యవసాయ శాఖా మంత్రుల వద్దకు పోతుంది. తెలంగాణలో ఉన్న బీజేపీ నాయకులు ఏం నాయకులు, మీది ఏం పార్టీ అని ప్రశ్నించారు. తెలంగాణలో ఆర్ ఆర్ ట్యాక్స్ పై అమిత్ షా సిబిఐ విచారణ జరిపించాలి. ఢిల్లీకి రేవంత్ రెడ్డి పైసలు పంపితే కేంద్రం ఏం చేస్తోందన్నారు.

రేవంత్ రెడ్డి తెలంగాణను లూటీ చేస్తున్నారు. వేల కోట్లు దండుకుంటున్న రేవంత్ రెడ్డిని మోదీ, అమిత్ షా ఎందుకు కాపాడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి మరో హిమంత బిశ్వ శర్మ లా మోదీ, అమిత్ షా కు కనిపిస్తున్నారు.

రేవంత్ రెడ్డి పైన మోదీ, అమిత్ షా కు ప్రత్యేకమైన ప్రేమ ఉందని పేర్కొన్నారు. కేంద్రం 20 వేల కోట్లు ఇవ్వాలని ఢిల్లీలో రేవంత్ రెడ్డి ఎందుకు చిన్న ధర్నా చేయలేదని సూటి ప్రశ్నించారు. దేశంలో పెద్ద ఓట్ చోర్ రేవంత్ రెడ్డిది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డిపై ఇప్పటికీ కేసు ఉందని గుర్తు చేశారు. డీజీపీ రాష్ట్రంలో అనుముల రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు పాల్వాయి ప్రవంతి ,కె .కిషోర్ గౌడ్ తదితరులు ఉన్నారు

మై భారత్ చేపట్టిన 'వికసిత్ భారత్ యువ సంవాద్: నో యువర్ వోట్' ప్రచారం ద్వారా 20 రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాల్లో 60 కార్యక్రమాల నిర్వహణ



న్యూఢిల్లీ, నవంబర్ 3:మేరా యువ భారత్ (మై భారత్) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నేడు నిర్వహించిన 'వికసిత్ భారత్ యువ సంవాద్: నో యువర్ వోట్' (మీ ఓటు గురించి తెలుసుకోండి) కార్యక్రమాల్లో 11,800 మందికి పైగా యువత పాల్గొన్నారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని యువజన వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. తాజా విడత కార్యక్రమాలతో కలిపి ఇప్పటివరకు 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 220 యువ సంవాద్ కార్యక్రమాలు జరిగాయి. వీటి ద్వారా 43,995 మంది యువత, 220 మంది యువ ప్రతినిధులు (యూత్ ఐకాన్లు) భాగస్వాములయ్యారు.

ఈ దేశవ్యాప్త ప్రచారం 2026 అక్టోబర్ 26 నుంచి నవంబర్ 5 వరకు కొన సాగుతోంది.

దేశవ్యాప్తంగా 500 విశ్వవిద్యాలయాలు, కళాశాల లు, విద్యానంస్థల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ముఖ్యంగా తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువతతో పాటు యువతలో ఎన్నికలపై అవగాహన పెంపొందించడం, ప్రజాస్వామ్య ప్రక్రియలో వారు సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకుని చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించడం ఈ ప్రచారం ప్రధాన ఉద్దేశం. ఓటు హక్కులు, ఎన్నికల విధానాలు, పౌర బాధ్యతలపై యువతకు అవగాహన కల్పించడంతో పాటు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, యువ ప్రతినిధులు, ఇతర ప్రముఖులతో నేరుగా మాట్లాడే అవకాశాన్ని ఈ కార్యక్రమం కల్పిస్తోంది.

న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమానికి కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రి శ్రీ హర్ష్ మల్హోత్రా హాజరయ్యారు.

ఓటు హక్కులు, ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యం ప్రాధాన్యం, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో బాధ్యతాయుత పౌరులుగా యువత పోషించాల్సిన పాత్రపై ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు.

పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లాలో జరిగిన కార్యక్రమానికి రణఘాట్ (ఎస్సీ) లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ శ్రీ జగన్నాథ్ సర్కార్ హాజరై విద్యార్థులతో మాట్లాడారు. అసోంలో నాగావ్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీ శ్రీ దేవాశిష్ శర్మ యువతతో ముచ్చటించారు.

బిహార్‌లోని పూర్వీ చంపారన్ (మోతిహారి), సివాన్ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సామూహికంగా 'లోక్‌తాంత్రిక్ ప్రతిజ్ఞ' (సామూహిక ప్రజాస్వామ్య) చేశారు. బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరిస్తూ, ప్రజాస్వామ్యంలో చురుకుగా పాల్గొంటామని ఈ సందర్భంగా పాల్గొన్నవారు పేర్కొన్నారు. కతిహార్ సదర్ ఎమ్మెల్యే, బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తార్కిశోర్ ప్రసాద్ కతిహార్‌లో జరిగిన యువ సంవాద్ కార్యక్రమంలో యువతతో మాట్లాడారు.

ఓటు ప్రాధాన్యతను అర్థం చేసుకుని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో చురుకుగా భాగస్వాములు కావాలని వారిని ప్రోత్సహించారు.

హర్యానాలోని పానిపట్‌లో పుషు క్రీడాకారుడు, యువ ప్రతినిధి ఆర్యన్ సూద్ యువతతో మాట్లాడారు. రాజకీయాల్లో యువత పాత్ర, ఓటుపై అవగాహన, క్రీడారంగంలో కెరీర్ అవకాశాలపై వారితో చర్చించారు. పంజాబ్‌లోని మాన్సాలో నిర్వహించిన కార్యక్రమంలో యూత్ ఐకాన్, పాల్గొన్న యువత మధ్య ముఖాముఖి చర్చ జరిగింది. అనంతరం సామూహికంగా 'లోక్‌తాంత్రిక్ ప్రతిజ్ఞ' చేశారు.

మధ్యప్రదేశ్‌లోని బర్వానీ, బాలాఘాట్, భింద్, ఛింద్వారా, దిండోరి, గుణ, పన్నా, రత్లాం, సాగర్ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో యూత్ ఐకాన్లు, క్రీడారంగ ప్రముఖులు, ప్రజాప్రతినిధులతో యువత ముఖాముఖి చర్చలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో 'లోక్‌తాంత్రిక్ ప్రతిజ్ఞ' కూడా నిర్వహించారు. మై భారత్ ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలు, దాని డిజిటల్ వేదికల గురించి కూడా యువతకు పరిచయం చేశారు.

ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ (సుల్తాన్‌పూర్)లో జరిగిన కార్యక్రమంలో యువ ప్రతినిధి ప్రసంగం ఇచ్చారు.

అనంతరం ప్రశ్నోత్తరాల రూపంలో చర్చ నిర్వహించారు. "సామాజిక మాధ్యమ ప్రముఖుడు (ఇన్‌ఫ్లుయెన్సర్) రిషభ్ మిశ్రా యువతను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు కవితలు వినిపించారు. డాక్టర్ ధనంజయ్ సింగ్, విష్ణవ్ మిశ్రా స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేసి, యువతతో మాట్లాడారు.

ఈ కార్యక్రమాల ద్వారా మై భారత్ యువతకు ప్రజాప్రతినిధులు, యువ ప్రతినిధులతో నేరుగా మాట్లాడే అవకాశాలను కల్పిస్తోంది. ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం, పౌర బాధ్యతలపై చర్చల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తోంది.

'పెన్షనర్లు జీవన్ ప్రమాణ్ లైఫ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి'

కొత్తగూడెం ఏరియా జీఎం సీహెచ్.వెంకట రమణ

ఈ 5, 6 తేదీల్లో రుద్రంపూర్ సీఈఆర్ క్లబ్‌లో అవగాహన సదస్సు

ఖమ్మం, నవంబర్ 3: కోల్ మైన్స్ పెన్షన్, సింగరేణి సీపీఆర్ఎంఎస్ (అఖఖీఓ) మెడికల్ కార్డు అర్హత కలిగిన మాజీ సింగరేణి ఉద్యోగులు, పెన్షనర్లు ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో తమ లైఫ్ సర్టిఫికెట్ (జీవన్ ప్రమాణ్)ను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సీహెచ్.వెంకట రమణ సూచించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. జీవన్ ప్రమాణ్ లైఫ్ సర్టిఫికెట్‌ను డిజిటల్ విధానంలో సులభంగా నమోదు చేసుకునే ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం, రీజినల్ కమిషనర్, సీఎంపీఎఫ్ కొత్తగూడెం రీజియన్ సంయుక్తంగా అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు.

రెండు రోజుల పాటు అవగాహన సదస్సు

ఈ నెల 5, 6 తేదీల్లో రుద్రంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదస్సు కొనసాగుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా పెన్షన్‌తో పాటు సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డు కోసం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను నమోదు చేసుకునే విధానాన్ని వివరించనున్నారు. మాజీ సింగరేణి ఉద్యోగులు, పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీఎం కోరారు. అర్హులైన వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి సదస్సుకు హాజరై జీవన్ ప్రమాణ్ లైఫ్ సర్టిఫికెట్‌ను నమోదు చేసుకోవాలని సూచించారు.

'సాగర్ రోడ్డు నుండి వెంకటరమణ కాలనీకి లింక్ రోడ్డు నిర్మించాలి'



- 100 మీటర్ల మేర ప్రభుత్వ స్థలం కేటాయించి వెంటనే పనులు చేపట్టాలి -నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి డిమాండ్

నల్గొండ, నవంబర్ 3: నల్లగొండ పట్టణంలోని 9వ డివిజన్ పరిధిలో సాగర్ రోడ్డు నుండి వెంకటరమణ కాలనీకి లింక్ రోడ్డు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాగర్ రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుండి వెంకటరమణ కాలనీ వరకు లింక్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే ఈ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణం పూర్తికాక పోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సాగర్ రోడ్డు నుండి వెంకటరమణ కాలనీ, వసుంధర కాలనీ, పటేల్ నగర్, నూర్యవంశం కాలనీ, చైతన్యపురి కాలనీలకు అనుసంధాన రహదారి లేకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేవలం 100 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడితే ఈ కాలనీల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana. 'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.